వంతెన.. నీటిపాలు



నీటి తాకిడికి కొట్టుకుపోయిన వంతెన

హావేరి, న్యూస్‌టుడే : భారీ వర్షానికి కుముద్వతి నది పోటెత్తింది. హావేరి, చిత్రదుర్గ జిల్లాల్లో ప్రవాహం భయపెడుతోంది. రట్టిహళ్లి తాలూకా ఎలివాళ- చప్పరదహళ్లి గ్రామాల మధ్య ఉన్న వంతెన నీటిలో మునిగిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇది పుణె - బెంగళూరు జాతీయ రహదారి కావడంతో వందలాది వాహనాలు కదల్లేని పరిస్థితి ఎదురైంది. స్థానికులు వంతెనపైకి వెళ్లకుండా పోలీసులు ఇరువైపులా బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. నదీ తీరంలోని పలు ఉద్యానవనాల్లోకి నీరు చేరింది. కొన్ని పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి.



పుణె- బెంగళూరు జాతీయ రహదారిపై రాకపోకలకు ఆటంకం

కులకర్ణి కేసు సీఐడీకి



కులకర్ణి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మాజీ మంత్రి, ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి (కాంగ్రెస్) తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఓ మహిళ ఆరోపించిన నేపథ్యంలో దర్యాప్తు బాధ్యతలను ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఒక రైతు మహిళ ఇప్పటికే సంజయనగర ఠాణాలో ఈ అంశంపై ఫిర్యాదు చేసింది. తనను రూ.2 కోట్లు ఇవ్వాలని బెదిరిస్తూ ఆమె తనపై ఫిర్యాదు చేసిందని వినయ్ కులకర్ణి ప్రత్యారోపణ చేశారు. దర్యాప్తు బాధ్యతలను సీఐడీకి అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశించింది.

నాగేంద్ర.. అసలు సూత్రధారి



నాగేంద్ర

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మహర్షి వాల్మీకి కార్పొరేషన్‌లో జరిగిన కుంభకోణానికి అప్పటి మంత్రి, ఎమ్మెల్యే బి.నాగేంద్ర సూత్రధారి అని ఈడీ అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేక న్యాయస్థానంలో ఈడీ అధికారులు అభియోగపత్రాన్ని ఇదే అంశంపై దాఖలు చేశారు. గంగా కల్యాణ పథకానికి సంబంధించి రూ.43.33 కోట్లను ఖజానా నుంచి అక్రమంగా బదిలీ చేయించుకోవడం, కార్పొరేషన్ ఖాతాల నుంచి వివిధ ఖాతాలకు బదిలీ అయి వెళ్లిన రూ.89.62 కోట్లలో రూ.20.19 కోట్లను బళ్లారి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఖర్చు చేసేందుకు నాగేంద్ర సహకారాన్ని అందించారని అభియోగపత్రంలో పేర్కొన్నారు. నాగేంద్ర ఆప్తుడు విజయకుమార్ చరవాణిలోనూ పలు సాక్ష్యాలను అభియోగపత్రంతో పాటు కోర్టులో దాఖలు చేశారు. నాగేంద్రతో పాటు సత్యనారాయణ వర్మ, సత్యనారాయణ, జేజీ పద్మనాభ, నాగేశ్వరరావు, నెక్కంటి నాగరాజ్, విజయకుమార్ గౌడ, తదితర 18 మందిని నిందితులుగా ఈడీ పేర్కొంది.

కరోనా అక్రమార్కులపై ఉక్కుపాదం

● సిట్ పర్యవేక్షణకు పచ్చజెండా ● మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం



ఈనాడు, బెంగళూరు : కాంగ్రెస్ సర్కారును ముప్పు తిప్పలు పెడుతున్న ముడా, వాల్మీకి అభివృద్ధి మండలి అక్రమాలను తలదన్నే వ్యవహారాలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కానున్నాయి. ఇప్పటికే హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖేల్ కున్హా నేతృత్వంలో ఏర్పాటైన కమిషన్ ఈ అక్రమాలపై పాక్షిక నివేదికను సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కమిషన్ తుది నివేదిక తయారయ్యేలోగా మరో వైపు నుంచి అక్రమాల చిట్టాను వెలికితేసేందుకు సిద్ధరామయ్య సర్కారు సిద్ధమైంది. బెంగళూరులో గురువారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఓ నిర్ణయంతో.. భాజపా వర్గాల్లో అలజడి రేగింది. అందులోనూ గత సర్కారు సమయంలో వైద్య, ఆరోగ్యశాఖలకు మంత్రిగా పని చేసిన డాక్టర్ కె.సుధాకర్‌కు ఈ నిర్ణయం గుబులు పుట్టించేలా మారనుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశంలో తీసుకున్న తీర్మానాలపై రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి హెచ్.కె.పాటిల్ వెల్లడించారు.

అక్రమాలపై దృష్టి

భాజపా పాలన సమయంలో కరోనా నియంత్రణ, చికిత్సల పేరిట కొనుగోలు చేసిన పీపీఈ కిట్లు, మాస్కులు, ఔషధాలు, ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు, ప్రత్యేక పడకల కొనుగోళ్ల పేరిట వేలకోట్ల విలువైన ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని గతేడాది ప్రజాపద్దులు, గణాంకాల సమితి నివేదిక ఇచ్చింది. ఈ నివేదికను అదే ఏడాది జులైలో నిర్వహించిన విధానసభ సమావేశాల్లో సర్కారు సభలో ప్రవేశపెట్టింది. నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో అధికారుల బృందం వీటికి సంబంధం ఉన్న శాఖలపై సమీక్ష చేపట్టాలని సర్కారు సూచించింది. జస్టిస్ జాన్ మైఖేల్ కున్హా నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలని సర్కారు ప్రతిపాదించింది. ఆ కమిషన్ సమీకరించిన వివరాలు, చేపట్టిన సమీక్షతో 11 సంచికలతో కూడిన నివేదికను గత ఆగస్టులో సర్కారుకు సమర్పించింది. ఇందులో రూ.7,233.64 కోట్ల విలువైన ప్రజాధనం కరోనా నియంత్రణ పేరిట దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. కరోనా నియంత్రణ చర్యలను అమలు చేసిన వివిధ శాఖలకు చెందిన 55 వేల దస్త్రాలను పరిశీలించాలని సూచించిన ఈ కమిషన్ అన్ని సాక్ష్యాలున్న అధికారులు, వ్యవస్థల నుంచి రూ.550 కోట్లను వసూలు చేయాలని సిఫార్సు చేసిందని మంత్రి వెల్లడించారు.

ఎస్ఐటీ ఏర్పాటు..

అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించిన వారిపై కేసులు నమోదు చేయాల్సి ఉంది. ఇందు కోసం ప్రత్యేక దర్యాప్తు దళం (ఎస్ఐటీ) ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. ఈ అధికారుల దర్యాప్తుతో పాటు మంత్రివర్గ ఉపసమితి కున్హా కమిషన్ నివేదిక పునఃసమీక్ష, పర్యవేక్షణ కోసం మంత్రివర్గ ఉపసమితి ఏర్పాటుకు మంత్రులంతా ఆమోదం తెలిపారు. ఈ సమితిలో సభ్యుల ఎంపిక ముఖ్యమంత్రి నేతృత్వంలో చేపడతారు. ఇప్పటికే కున్హా కమిషన్ సిఫార్సు ప్రకారం కిద్వాయ్ ఆస్పత్రిలో ఓ వైద్యాధికారిని విధుల నుంచి తొలగించిన సర్కారు రానున్న రోజుల్లో కొందరు అధికారులపై చర్యలు తీసుకోనుంది. బీబీఎంపీ పరిధిలోని నాలుగు ఆరోగ్య వలయాలు, 31 జిల్లాల్లో కున్హా కమిషన్ సమీక్ష చేపట్టనుంది. ఈ కమిషన్‌కు మంత్రివర్గ ఉపసమితి చేసే పర్యవేక్షణ ద్వారా సలహాలివ్వనుంది. తుది నివేదిక తర్వాతనే ఆ అధికారులెవరో తేలనుంది.



మాజీ మంత్రి సుధాకర్



సిద్ధరామయ్య ఎత్తుగడల వేగం

మరిన్ని తీర్మానాలు..

● ఇప్పటికే రాష్ట్రంలోని అక్రమ గనుల తవ్వకాలపై విచారణ చేపట్టేందుకు లోకాయుక్త నేతృత్వంలో ప్రభుత్వం సిట్ నియమించింది. ఈ దర్యాప్తు కాలాన్ని మరో ఏడాదికి విస్తరించాలని మంత్రివర్గం తీర్మానించింది.

● రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లల్లో నమోదైన 43 క్రిమినల్ కేసులను రద్దు చేయాలని తీర్మానించారు.

● బెంగళూరులోని ఓకలిపురం పట్టు సంవర్ధకశాఖకు చెందిన 4.25 ఎకరాల స్థలంలో రూ.527.50 కోట్లతో 'రేష్మి భవన్' నిర్మించనున్నారు. ఇందుకు కర్ణాటక ఖనిజ మండలి (కేఎస్ఎంసీఎల్) నిధులు సమకూర్చనుంది. చిక్కబళ్లాపుర లోని శిడ్లఘట్టలో హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్‌ను రూ.200 కోట్లతో స్థాపించాలని తీర్మానించారు.

● ముడా అక్రమాల్లో కేసు నమోదైన ముఖ్యమంత్రికి మద్దతివ్వాలని ఈ సమావేశంలోనూ మంత్రులంతా తీర్మానించారు. ఓ వైపు మంత్రుల రహస్య సమావేశాలు, అధిష్ఠానంతో భేటీలు కొనసాగుతున్నా అవన్నీ సిద్ధరామయ్య పీఠానికి భంగం కల్గించవని మంత్రి హెచ్.కె.పాటిల్ ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

చర్యలు ఇన్నాళ్లకా?

సర్కారు ఏర్పాటై ఏడాదిన్నర కావస్తోంది. ఇన్ని రోజుల తర్వాత మా పాలనా కాలంలోని కరోనా అక్రమాలు కనిపించాయా? అంటూ భాజపా ప్రశ్నించింది. రూ.5 వేల కోట్ల ముడా అక్రమాలు, రూ.187 కోట్ల వాల్మీకి ఎస్టీ మండలి అక్రమాలను బయటకు తీశామన్న అక్కసుతో కరోనా నియంత్రణ పేరిట అక్రమాలను సర్కారు గుర్తించింది. వాస్తవంగా అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు తప్పవు. కేవలం కక్ష సాధింపు కోసం అక్రమాలను ఆలస్యంగా గుర్తించటం, సిట్ ఏర్పాటు చేయడమేంటని భాజపా ప్రశ్నించింది.

సిద్ధు బావమరిది విచారణకు హాజరు

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారలో ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బావమరిది మల్లికార్జున స్వామి, ఆయనకు భూమి విక్రయించిన దేవరాజు అనే వ్యక్తులు లోకాయుక్త అధికారుల ముందు విచారణకు గురువారం హాజరయ్యారు. ఈ కేసులో వారిద్దరూ వరుసగా ఏ3, ఏ4గా ఉన్నారు. సిద్ధరామయ్య ఏ1గా, ఆయన భార్య పార్వతి ఏ2గా ఉన్నారు. హైకోర్టు ఆదేశాలతో లోకాయుక్తలో కేసు నమోదైంది. డిసెంబరు 24లోగా దర్యాప్తు పూర్తి చేసి లోకాయుక్త అధికారులు నివేదిక ఇవ్వవలసి ఉంటుంది. విజయదశమి అనంతరం విచారణకు హాజరు కావాలని ముఖ్యమంత్రి, ఆయన భార్యకు అధికారులు నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది.

ముఖ్యమంత్రి కావాలనే నా లక్ష్యం: సతీశ్



సతీశ్ జార్కిహొళి

హాసన, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి మార్పునకు సంబంధించి పార్టీలో, అధిష్ఠానం వద్ద ఎటువంటి చర్చలు జరగలేదని ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి స్పష్టం చేశారు. తాను 2028లో ముఖ్యమంత్రి కావాలన్న లక్ష్యంతో పని చేస్తున్నానని చెప్పారు. ఆయన హాసనలో విలేకరులతో గురువారం మాట్లాడుతూ పత్రికలు, ప్రచార మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం అది వారి సొంత అభిప్రాయమని పేర్కొన్నారు. తన కుమార్తె ప్రియాంక్ జార్కిహొళి ఎంపీగా ఉత్తమ సేవలు అందించాలని సూచిస్తూ మార్గదర్శనం చేస్తున్నానని చెప్పారు. మరో నాలుగేళ్ల అనంతరం తాను ముఖ్యమంత్రి అయ్యేందుకు సీఎం, ఇతర నాయకులు పూర్తి సహకారం అందిస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు.

పాలధర యథాతథం

సర్కారు కీలక నిర్ణయం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఈ ఏడాది పాల ధరను పెంచకూడదని ప్రభుత్వం, కర్ణాటక పాల సమాఖ్య తీర్మానించాయి. ఇప్పటికే ప్రతి ప్యాకెట్‌తో ఇస్తున్న పాల పరిమాణాన్ని పెంచుతూ, ధరను కూడా మూడు నెలల కిందట పెంచారు. ధరల పెంపు వద్దని పలువురి విన్నపాలతో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. నీలం రంగు ప్యాకెట్ లీటరుకు రూ.44, కాషాయరంగు ప్యాకెట్ రూ.48, శుభం ప్యాకెట్ రూ.50, సమృద్ధి ప్యాకెట్ రూ.53కు సమాఖ్య విక్రయిస్తోంది. లీటరుకు రూ.5 వరకు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా, రూ.2 వరకు పెంపునకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం యోచించింది.

కథానాయకుడి దారెటు?



దర్శన్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో బెయిలు కోరుతూ నటుడు దర్శన్ వేసుకున్న అర్జీ విచారణపై వాదనలు పూర్తయ్యాయి. రిజర్వు చేసిన తీర్పును సోమవారం ప్రకటిస్తామని న్యాయమూర్తి వెల్లడించారు. దర్శన్ పేరును ఉద్దేశపూర్వకంగా ఇరికించారని ఆయన తరఫు న్యాయవాది సీవీ నాగేశ్ వాదనను ప్రభుత్వ న్యాయవాది ప్రసన్నకుమార్ తోసిపుచ్చారు. తామే హత్య చేశామంటూ గిరినగర ఠాణాలో లొంగిపోయిన ముగ్గురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలంతోనే కేసు మలుపుతిరిగిందని- దర్శన్ నేరుగా హత్యలో పాల్గొన్నారని వారు వాంగ్మూలాన్ని ఇచ్చారనే వాదనలను వినిపించారు. హత్య సమయంలో దర్శన్ బూట్లు ధరించారా? చెప్పులు ధరించి ఉన్నారా అనేది ఇక్కడ ముఖ్యం కాదని.. హత్య చేశారా? లేదా? అనే అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. దర్శన్ బూట్ల నుంచి సేకరించిన మన్ను, సంఘటన స్థలంలోని మట్టికి, బూట్లపై ఉన్న రక్తం చుక్కలకు, హతుడు రేణుకాస్వామి రక్తానికి సరిపోలిందన్నారు. ఈ కేసులో ఏ13 దీపక్‌కు జామీను మంజూరు చేసేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని ప్రసన్నకుమార్ తెలిపారు. అతనిపై సాక్ష్యాలను నాశనం చేసిన ఆరోపణలు మాత్రమే ఉన్నాయని తన వాదనలో పేర్కొన్నారు. మరో వైపు భర్తకు బెయిలు రావాలని కోరుకుంటూ దర్శన్ భార్య విజయలక్ష్మి చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు బళ్లారి కారాగారం నుంచి బెంగళూరు పరప్పన అగ్రహార కారాగారానికి దర్శన్‌ను తరలించేందుకు హైకోర్టు అనుమతి మంజూరు చేసింది.

దంపతుల బలవన్మరణం

రామనగర, న్యూస్‌టుడే : చెన్నపట్టణ తాలూకా కర్లహళ్లిలోని తమ పశువుల కొట్టంలో ఉరి వేసుకుని రాజు (34), లక్ష్మి (30) అనే దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఐదేళ్ల కిందటే వీరికి వివాహమైంది. ఉపాధి అవకాశాలు కరవు కావడంతో అప్పులు చేశారు. అప్పు తీర్చలేక వ్యధతో వీరు ఆత్మహత్య చేసుకున్నారని అనుమానిస్తున్నారు. అక్కూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆధ్యాత్మిక క్షేత్రంపై దాడి


కలబురగి, న్యూస్‌టుడే : చిత్తాపుర-కరదళ్లి రహదారి మధ్యలోని సయ్యద్ పీర్ దర్గాపై కొందరు దుండగులు దాడి చేశారు. గేటు తాళం పగలగొట్టి దర్గా ఆవరణలోకి ప్రవేశించిన నిందితులు అక్కడి గోపురం, కట్టను పగలగొట్టి పరాయ్యారని కేసు నమోదైంది. దర్గా ఇన్‌ఛార్జ్ సయ్యద్ ఫిర్యాదుతో చిత్తాపుర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అపురూపం.. రతన్ బంధం



ఇస్కాన్ వంటగదిని పరిశీలిస్తున్న రతన్ టాటా

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : వ్యాపార దిగ్గజం రతన్ టాటా మరణవార్తతో కన్నడనాడు దిగ్భ్రాంతికి గురైంది. ఆయన మరణ వార్త జీర్ణించుకోలేనిదని పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. రాష్ట్రంలోని పలువురు ప్రముఖులతో ఆయనకు అవినాభావ సంబంధం ఉంది. హుబ్బళ్లి బీవీబి కళాశాలలో 2013 జనవరి 30న దేశ్‌పాండే ఫౌండేషన్ 'టిప్పింగ్ పాయింట్' పేరిట నిర్వహించి సమావేశంలో రతన్ టాటా పాల్గొనడం ప్రస్తావనార్హం. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తితో కలిసి చర్చాగోష్ఠిలో మాట్లాడారు. హుబ్బళ్లి సమీపంలోని రాయపురలో ఇస్కాన్ వంటశాలలకు వెళ్లి అక్కడ వంటకాల తయారీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉడుపికి కృష్ణ మఠాన్ని పదేళ్ల కిందట ఆయన సందర్శించారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని ఐటీ పార్కులో తన సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు రెండు దశాబ్దాల కిందట పర్యటించినప్పుడు ఇక్కడి ఐటీ రంగ ప్రముఖులతో సుదీర్ఘంగా ముచ్చటించడం ప్రస్తావనార్హం. బెంగళూరులో ఎయిర్‌షోలో యుద్ధ విమానాన్ని ఆయన ఓసారి నడిపి సంచలనంగా మారారు. టాటా మృతికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు పలువురు మంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల నాయకులు, హ్యాట్రిక్ స్టార్ శివరాజ్ కుమార్, కాంతార ఫేం రిషబ్ శెట్టి, నటదర్శకుడు ఉపేంద్ర, నిర్మాత అశ్విని పునీత్‌రాజ్ కుమార్ తదితరులు సంతాపాన్ని ప్రకటించారు.



బెంగళూరులో రతన్‌టాటాతో సుధామూర్తి

మెకానిక్ పాషా.. నేడు బాద్‌షా!



అల్తాఫ్ పాషాను అభినందిస్తున్న లాటరీ సిబ్బంది

ఈనాడు, బెంగళూరు : గత పదిహేనేళ్లుగా కేరళలోని తన స్నేహితుడి ఇంటికి తరచూ వెళ్లి వస్తున్న అల్తాఫ్ పాషా పక్షం రోజుల కిందట అలవాటులో భాగంగా ఓ లాటరీ టికెట్ కొన్నాడు. అది కేరళలోని వయనాడ్‌కు చెందిన సుల్తాన్ బతేరి తిరువోణం బంపర్ లాటరీ సంస్థ టికెట్. రూ.500ల విలువ చేసే రెండు టికెట్లను కొన్న అల్తాఫ్ వాటిల్లో ఒకటి తనకు ఎంతో ఇష్టమైన స్నేహితుడికే ఇద్దామని నిర్ణయించుకున్నాడు. ఎందుకో.. ఆయన భార్య సీమా వద్దని వారించింది. ఏ టికెట్‌లో ఏం అదృష్టం దాగుందో చూద్దామని భార్య చెప్పిన సలహాను అల్తాఫ్ పాటించాడు. ఆ నిర్ణయమే నేడు అల్తాఫ్‌ను కోటీశ్వరుడిని చేసింది. బుధవారం మధ్యాహ్నం లాటరీ ఏజెన్సీ సిబ్బంది ఒకరు అల్తాఫ్‌కు ఫోన్ చేసి మీరు కొన్న టి.జి.434222 నంబరు టికెట్‌కు రూ.25 కోట్ల లాటరీ దక్కిందని చెప్పగానే.. అల్తాఫ్ కుటుంబ సభ్యులంతా ఎగిరి గంతేశారు. సరిగ్గా స్నేహితుడికి ఇద్దామనుకున్న ఆ టికెట్టే నేడు అల్తాఫ్‌కు కోట్లు తెచ్చిపెట్టింది. కర్ణాటకలోని మండ్య జిల్లా పాండవపురంలో బైక్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్న 42 ఏళ్ల అల్తాఫ్ పాషా జీవితం బుధవారం నుంచి పూర్తిగా మారిపోయింది.

అప్పులూ తీర్చేస్తా: తానొకడినే కోటీశ్వరుడిని కావాలన్న ఆశ నాకు లేదంటున్నాడు అల్తాఫ్ పాషా. తనకు వచ్చిన సొమ్ముతో అన్నదమ్ములు చేసిన అప్పులన్నీ తీర్చి అందరం కలిసి ఉండేలా పెద్ద ఇళ్లు కట్టుకోవాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. తన కుమార్తె తనాజ్ ఫాతిమాను డాక్టర్ చేయాలన్న కలతో పాటు తన మెకానిక్ షాపును పెద్ద గ్యారేజీగా మార్చాలని నిర్ణయించాడు. నేను ఎప్పటికైనా అదృష్టవంతుడిని అవుతానని పట్టుదలతో ఉన్న అల్తాఫ్ ఏటా కనీసం ఐదుసార్లు కేరళకు వెళ్లి లాటరీ టికెట్లు కొనుగోలు చేస్తుంటాడు. తనతో పాటు అన్నదమ్ములందరికీ కొనాలని సలహాలిస్తుంటాడు. కనీసం లక్షాధికారి కాలేకపోతానా అన్న అల్తాఫ్ ఆశయం నేడు కోట్ల వద్ద నెరవేరింది.

దక్కేది సగమే: లాటరీ ద్వారా వరించిన మొత్తం రూ.25 కోట్లే అయినా అల్తాఫ్ చేతికి అందులో సగం మాత్రమే రానుంది. ఏజెంట్ కమీషన్ రూ.2.5 కోట్లు, టీడీఎస్ రూ.6.75 కోట్లు, సర్చార్జ్ రూ.2.50 కోట్లు, ఆరోగ్యం, విద్య సెస్ రూ.34 లక్షలు పోగా రూ.25 కోట్ల తొలి విజేతకు రూ.12.9 కోట్లు మాత్రమే దక్కనున్నాయి.

విహారికి రాచనగరి ఎగ్రతివాచీ!

మైసూరు, న్యూస్‌టుడే : కన్నడనాట మైసూరు దసరా సంబరాల ఢంకా మార్మోగుతోంది. ఎపుడెపుడా అని ఎదురు చూస్తున్న ఆయుధ పూజ ఘట్టం శుక్రవారం పూర్తి చేస్తే.. ఇక శనివారం కనుల కింపైన జంబూసవారీతోపాటు విజయదశమి కీలక వేడుకలు కొనసాగనున్నాయి. అటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మొదలు.. రాజవంశ పాలకుడు యదువీర్ కృష్ణదత్త ఒడెయరు తదితరులు వేడుకల వేళ పూజాదికాలు నిర్వహించి- సంబరాలు వీక్షించనున్నారు. ఈ క్రమంలోనే గురువారం రాచనగరి సందడిగా మారిపోయింది. దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులు పెద్ద సంఖ్యలో నగరానికి చేరుకున్నారు. వారందరికీ ఆతిథ్యమివ్వడానికి వివిధ ప్రైవేటు సంస్థలు, ప్రభుత్వ విభాగాలు మునిగాళ్లపై నిలచి బాధ్యతలు నిర్వహిస్తున్నాయి. మునుపెన్నడూ లేనంతగా ఈసారి డ్రోన్‌షోకు చక్కని స్పందన లభించింది. యువ దసరాలో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రహమాన్ తన కళాకారులతో కలిసి ఇచ్చిన ప్రదర్శన యువతను ఆకట్టుకుంది. అంబావిలాస్ ప్యాలెస్‌లో కొనసాగుతున్న ప్రైవేటు దర్బారును రాజవంశస్థుడు యదువీర్ కృష్ణదత్త ఒడెయరు కొనసాగించారు. ఆయన శుక్రవారం ఆయుధాలకు, సింహాసనానికి పూజ చేయనున్నారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు జంబూ సవారీ ప్రారంభిస్తారు. బంగారు అంబారీపై కన్నడిగుల కులదేవత చాముండేశ్వరిని ఊరేగిస్తారు. శకటాల ప్రదర్శనకు స్తబ్ద చిత్రాలు సిద్ధమయ్యాయి. దసరాకు వస్తున్న పర్యాటకుల కోసం ప్రభుత్వం అదనపు బస్సులు, రైలు సేవలను పెంచింది. ఎక్కువ మంది పర్యాటకులు రావడంతో ప్రధాన వీధుల్లో రద్దీ నెలకొంది. అన్ని ప్రాంతాలనూ సీసీ కెమెరా నిఘా పరిధిలోకి చేర్చారు. ఆహార మేళా, వస్తు ప్రదర్శన కేంద్రాలు, ప్యాలెస్, చాముండిబెట్ట, జంతుప్రదర్శనశాల.. తదితర ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా కనిపించింది. జంబూ సవారీకి చివరి రిహార్సల్ గురువారం సాయంత్రం ముగిసింది. నగరంలో ఉంటున్న వారి ఇళ్లకు పెద్ద సంఖ్యలో బంధువులు వచ్చారు. కొందరు బొమ్మల కొలువును ఏర్పాటు చేసుకుని, తమ ఇళ్లకు బంధువులు, స్నేహితులను ఆహ్వానించారు.



బెంగళూరు కృష్ణరాజేంద్ర విపణిలో పండగ వస్తువుల కొనుగోలుకు పోటెత్తిన జనం



విద్యుత్తు దీపాల వెలుగులో మెరిసిపోతున్న మైసూరు రాజమందిరం



జంబూసవారీకి ముందస్తుగా చివరి సాధనలు పూర్తి చేసుకుని వెళుతున్న ఏనుగులు

బుద్ధి చెప్పిందనే.. అమ్మను కడతేర్చాడు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : బుద్ధిమాటలు చెబుతున్న తల్లిని హత్య చేసిన విరూపాక్ష అనే నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తుమకూరు జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు ఇచ్చిందని సంబంధిత అధికారులు గురువారం వెల్లడించారు. కుణిగల్ తాలూకా హంగరహళ్లికి చెందిన విరూపాక్ష తన తల్లి జయమ్మను 2021 జనవరి 15న రాత్రి హత్య చేశాడు. జయమ్మ పాలు విక్రయించుకుని కుటుంబాన్ని పోషించేది. ఏ పనీ చేయకుండా తల్లి వద్ద డబ్బు తీసుకుని విరూపాక్ష విలాసాలకు ఖర్చు చేసుకునేవాడు. ఏదో ఒక పని చేసుకోవాలని సూచించిన తల్లితో ఆ రోజు రాత్రి గొడవకు దిగాడు. చుట్టుపక్కలవారు సర్దిచెప్పడంతో అప్పటికి మిన్నకున్నాడు. రాత్రివేళ.. అమ్మ నిద్రిస్తుండగా అదను చూసి రుబ్బురోలుతో తల బద్దలుగొట్టి కడతేర్చాడు. అతనిపై హులియూరుదుర్గ ఠాణాలో కేసు నమోదైంది. నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ట్రాక్టరు ఢీకొని.. ముగ్గురి దుర్మరణం

కలబురగి, న్యూస్‌టుడే : చిత్తాపుర తాలూకా హలకర్టి గ్రామం వద్ద బుధవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మరణించారు. గురూజీ తాండాకు చెందిన అర్జున్ రాథోడ్, రోహిత్, కృష్ణ అనే వ్యక్తులు మరణించారని గుర్తించారు. వీరు వెళుతున్న బైకును వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. చిత్తాపుర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బాధిత కుటుంబాలకు మంత్రి ఆర్థిక సాయం

హొసపేటె, న్యూస్‌టుడే: కూడ్లిగి తాలూకా కుమతిలో చెరువులో పడి మృతిచెందిన ముగ్గురు బాలల కుటుంబాలకు జిల్లా బాధ్యమంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ వ్యక్తిగతంగా రు.5 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. పరిహారం కోసం ప్రభుత్వానికి ఉత్తరం రాస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. గురువారం కుమతి గ్రామంలో ఆయన బాలల తల్లిదండ్రులను పరామర్శించారు. ఇద్దరు కుమారులను కోల్పోయిన దంపతులు మంత్రి ముందు కన్నీరు మున్నీరయ్యారు. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా తల్లిదండ్రులు పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్, జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్, ఎస్పీ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులను పరామర్శిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్

కళాకారులను ఆదరించండి

సింధనూరు, న్యూస్‌టుడే: అందరిలో కళాకారులు ఉంటారు.. అంతమాత్రాన అందరూ మేటి కళాకారులు కాలేరు, ఆ కళలను కళ్లతో చూసి ఆనందించాలి.. ఆదరించే హృదయం కలిగి ఉండాలని స్థానిక ప్రముఖ నేత్ర వైద్యుడు, యువ సమాజ సేవకుడు చన్ననగౌడ పాటిల్ పేర్కొన్నారు. సింధనూరు ఆర్జీఎం మైదానంలో దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి 'సింధనూరు కళా దసరా' కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్.చన్ననగౌడ మాట్లాడుతూ ఈ ఏడాది సింధనూరు దసరా నేపథ్యంలో తొలిసారి తొమ్మిది రోజులు స్థానిక ప్రజలకు వినోదాల విందు లభించడం హర్షణీయమని కొనియాడారు. కళా దసరా సందర్భంగా ఉత్సవ సమితి రాష్ట్రస్థాయి చిత్రకళా పోటీలు నిర్వహించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఇందులో అయిదుగురిని విజేతలుగా ప్రకటించి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున బహుమతులు అందించారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్యే బాదర్లి, ప్రదేశ్ కాంగ్రెస్ సభ్యుడు నల్ల వెంకటేశ్వరరావు, జేడీఎస్ నాయకుడు జి.సత్యనారాయణ శాంతినగర్, ఆక్స్‌ఫర్డ్ కళాశాల పాలనాధికారి సత్యనారాయణ శెట్టి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలో విజేతలైన చిత్రకారులను సన్మానిస్తున్న ఉత్సవ సమితి

వ్యాయామం, ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీఎస్కేయూ ఉపకులపతి మునిరాజు, న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమని తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: మానసిక ఒత్తిడిని తట్టుకోవడానికి యోగా - ధ్యానం, ప్రాణాయామం సహాయపడతాయి. నిత్యం వీటిని దిన చర్యగా చేసుకోవాలని జిల్లా న్యాయసేవా ప్రాధికార సదస్య కార్యదర్శి, న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమని విద్యార్థులకు సూచించారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, వార్త శాఖ, జిల్లా మానసిక నియంత్రణ శాఖ, వీఎస్కేయూ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విశ్వవిద్యాలయం డా.బి.ఆర్.అంబేడ్కర్ సభాభవనంలో విశ్వ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని న్యాయమూర్తి ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కాలంలో తీరికలేని పనితో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీన్ని నివారించడానికి కష్టాలను ఇతరులతో పంచుకోవడం, నడక, వ్యాయామం, ధ్యానం, యోగా, ప్రాణాయామం వంటివి నిత్యం చేయాలన్నారు. జిల్లా మానసిక విభాగం వైద్యుడు రోహన్ వనగుంది మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి ఇచ్చిన ప్రాధాన్యం మానసిక ఆరోగ్యానికి ఇవ్వడం లేదన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు, సుఖాలుంటాయి. వీటిని పగలు, రాత్రిగా గుర్తించి సమానంగా స్వీకరించాలన్నారు. ఇటీవల కాలంలో స్మార్ట్ ఫోన్‌కు ఇచ్చిన సమయం కుటుంబ సభ్యులతో గడపడానికి కేటాయించడం లేదు. ఫలితంగా ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. వారానికి ఓ రోజు స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. జిల్లా మానసిక కార్యక్రమాల అధికారి వీరేంద్రకుమార్ మాట్లాడుతూ 25- 30 ఏళ్ల మధ్య వయస్సు వా మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. 15- 25 ఏళ్ల వయస్సులో ఉండే వారు ఎక్కువగా మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. ఫలితంగా ఆత్మహత్య కేసులు పెరుగుతున్నాయి. వీటిని నివారించడానికి సహాయవాణి 14416 ప్రారంభించాం. 24 గంటలపాటు అందుబాటులో ఉంటుందన్నారు. డీహెచ్‌వో డాక్టర్ యల్లా రమేష్‌బాబు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం కాపాడటానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. త్వరలో ఆత్మహత్య రహిత జిల్లాగా మార్చడానికి 'సురక్షా' అనే పథకం అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయం ఉపకులపతి మునిరాజు మానసిక వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేశ్, రమేష్ ఓ ఓలేకార్, వైద్యులు పూర్ణిమ, మరియంబి, ఇంద్రాని, అధికారి ఈశ్వర్ దాసప్పనవర్ పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు



మానసిక ఒత్తిడి నివారణకు సిద్ధం చేసిన పుస్తకం విడుదల చేస్తున్న ప్రముఖులు

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రతి మనిషికీ మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎన్.మహ్మద్ అలి అక్రం షా పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, వైద్యశాఖలు సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినాచరణ సందర్భంగా గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన మానసిక ఆరోగ్య జాగృతి ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానసిక ఆరోగ్యం దెబ్బతింటే మనిషి అన్ని విధాలుగా కుంగిపోతాడని హెచ్చరించారు. ఎల్లప్పుడూ చిన్నపాటి యోగా, ధ్యానం, పుస్తక పఠనం లాంటి ఉత్తమ అలవాట్లతో మనసును ప్రశాంతంగా పెట్టుకోవాలని సూచించారు. న్యాయమూర్తులు అశోక్, చైత్రా, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్, మానసిక ఆరోగ్య విభాగం జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాధిక పాల్గొన్నారు.



మానసిక ఆరోగ్య జాగృతి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా పంచాయతీ సీఈవో మహ్మద్ అలి అక్రం షా

బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన సంస్థ (బీఎంసీఆర్‌సీ) ఆధ్వర్యంలో గురువారం వైద్య కళాశాల ఉపాధ్యాయుల భవనంలో విశ్వ మానసిక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని నిర్దేశకుడు డా.గంగాధరగౌడ, విశ్రాంత వైద్యులు విద్యాధర్ కిన్నల్, మంజునాథ, శ్రీనివాసులు, భారతి, రాఘవేంద్ర ప్రారంభించారు. మానసిక సమస్యల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యంపై పలువురు మాట్లాడారు. - న్యూస్‌టుడే, బళ్లారి



జాతిపిత తత్వాలు ఆచరణీయం



గాంధీజీ చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళులర్పిస్తున్న జిల్లా బాధ్యమంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్

హొసపేటె, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మా గాంధీ తత్వాలు ఎల్లప్పుడూ ఆచరణీయమని జిల్లా బాధ్యమంత్రి బి.జెడ్.జమీర్ అహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. సమాచార, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో గాంధీజీ జయంత్యుత్సవం సందర్భంగా గురువారం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచాయి. మనకు ఆంగ్లేయుల నుంచి స్వేచ్ఛ లభించిందంటే ఆ ఘనత జాతిపిత గాంధీదేనని తేల్చిచెప్పారు. ఆయన జీవితం ఇతరులకు ఆదర్శమని కొనియాడారు. గాంధీజీ జీవితంపై ప్రత్యేక ఉపన్యాసం చేసిన ఉపన్యాసకుడు దయానంద్ కిన్నాళ్ మాట్లాడుతూ.. మనకు స్వేచ్ఛ తీసుకురావటానికి గాంధీజీ ఎన్నో అవమానాలు భరించారని గుర్తు చేశారు. కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్, జడ్పీ సీఈవో ఎన్.మహ్మద్ అలి అక్రం షా, ఎస్పీ శ్రీహరిబాబు, హుడా అధ్యక్షుడు మహ్మద్ ఇమామ్ నియాజి, సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి గవిసిద్ధప్ప హొసమని తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో నెగ్గిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించి సన్మానిస్తున్న అధికారులు

రుణ బాధతో అన్నదాత ఆత్మహత్య

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: భరమసాగర పోలీసు ఠాణా పరిధిలోని పళకేహళ్లి గ్రామానికి చెందిన రైతు హనుమంతప్ప(45) వ్యవసాయ పనుల కోసం చేసిన అప్పులను తిరిగి చెల్లించలేక ఇంటి గదిలో పైకప్పునకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన బుధవారం రాత్రి జరిగిందని పోలీసు అధికారులు తెలిపారు. హనుమంతప్ప తన 3 ఎకరాల పొలంలో పంటలను సాగు చేయడానికి నాలుగేళ్లుగా అప్పులు చేసి సుమారు రూ.5 లక్షలు వ్యయం చేశారన్నారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల కారణంగా పంటలు చేతికి అందక తీవ్రంగా నిరాశకు గురయ్యారన్నారు. ఇటీవల మొక్కజొన్న పంటను అడవి పందులు పంటలను తినేశాయి. చేసిన అప్పులు తిరిగి చెల్లించే దారి కనిపించక బలవన్మరణం చెందారని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారన్నారు.

లైన్‌మెన్ బలవన్మరణం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: భరమసాగర పోలీసు ఠాణా పరిధిలోని సిరిగెరె బెస్కాం కార్యాలయంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న రాజేశ్ (28) బుధవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు. రాజేశ్ స్వగ్రామం వీజాపురం గ్రామానికి సమీపంలోని పొలం వద్ద ఉన్న గదిలో ఉరి వేసుకొన్నారు. పోలీసులు కేసును నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

'అటవీ' ఉద్యోగులకు వేతనాల మాటేంటి?

చిక్కమగళూరు: మూడు నెలలుగా తమకు వేతనాలు అందడం లేదని చిక్కమగళూరు విభాగం అటవీశాఖ సిబ్బంది ఆక్రోశించారు. భోజనం, ఇతర భత్యాలు, వేతనాలు తమకు రావడం లేదని తెలిపారు. వన్యప్రాణులు గ్రామాలపై దాడులు చేయకుండా నియంత్రించేందుకు అటవీశాఖలో సేవలందిస్తున్న కొందరు సిబ్బందితో ప్రభుత్వం ఈటీఎఫ్ దళాన్ని ఏర్పాటు చేసింది. ఏడు జిల్లాల్లో ఈటీఎఫ్ దళాలు సేవ చేస్తున్నాయి.



వెంకటేశపురానికి చెందిన లక్ష్మీ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

ఆకట్టుకొంటున్న బొమ్మల కొలువు

చెళ్లకెర(చిత్రదుర్గం): పట్టణ శివార్లలోని వెంకటేశపురంలో నివాసముంటున్న లక్ష్మీ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వారం రోజులుగా చిన్నా పెద్ద తేడా లేకుండా పలువురు బొమ్మల కొలువును చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు లక్ష్మీ తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఏటా దసరా నవరాత్రుల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



ఆకట్టుకొంటున్న వివిధ రకాల బొమ్మలు

'కలబురగి' కేసులో ప్రభుత్వానికి తాఖీదులు

ధార్వాడ, న్యూస్‌టుడే : సీనియరు పరిశోధనకుడు ఆచార్య ఎంఎం కలబురగి హత్య కేసులో మూడో నిందితుడు ప్రవీణ్ బెయిలు కోసం వేసుకున్న అర్జీపై ఆక్షేపణలు తెలిపేందుకు ధార్వాడ హైకోర్టు పీఠం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో మొదటి నిందితుడు అమోల్ కాళే తూటాతో కలబురగిపై కాల్పులు జరిపాడనేది అభియోగం. హత్యకు ముందు, అనంతరం అతన్ని తన బైకులో ప్రవీణ్ తోడ్కొని వెళ్లాడు. రెండు సార్లు అతను బెయిలుకు వేసుకున్న అర్జీని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. మరోసారి వేసుకున్న అర్జీపై ఆక్షేపణలు తెలపాలని సూచిస్తూ జస్టిస్ ఎంజీ ఉమ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు.

ఉద్యానవనాల్లో చినుకులకు పాదులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఆకాశం నుంచి రాలే చినుకులు వృథాకాకుండా వాటిని భూమిలో ఇంకేలా బెంగళూరు పాలికె ప్రత్యేక పథకాలకు శ్రీకారం చుట్టింది. ఎక్కడికక్కడ వాననీటిని ఒడిసి పట్టడానికి వీలుగా వివిధ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు నిర్మిస్తోంది. ఈ పథకం విజయవంతమైతే భూగర్భజలాల మట్టం విపరీతంగా పెరిగి, వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తబోదని అధికారులు అంచనా వేస్తున్నారు. నగర ప్రజలు దాహార్తి తీర్చేందుకు కావేరి నీరు సరిపోవడం లేదు. సగం మంది భూగర్భ జలాలపై ఆధారపడుతున్నారు. వృథాగా పోతున్న వాననీటిపై పాలికె దృష్టి సారించింది. నగరవ్యాప్తంగా ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 634 ఇంకుడు గుంతలు తవ్వించారు. వచ్చే ఏడాది ఈ సంఖ్య వెయ్యికి తక్కువ ఆకకుండా చూడాలని పాలికె ప్రత్యేక కమిషనర్ ప్రీతి గహ్లోత్ వెల్లడించారు. పాలికె పరిధిలో 1280 ఉద్యానవనాలు విస్తరించాయి. వాటిలో 12 అడుగుల వెడల్పు-ఐదు అడుగుల లోతు గుంతలను తవ్వి.. శాస్త్రీయంగా వాననీరు ఇంకేలా చేస్తారు. ప్రతి ఉద్యానవనంలో నాలుగు వేల లీటర్ల వాననీటి సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. కొన్ని ఉద్యానవనాల్లో ఎండిపోయిన బోరుబావులను పునఃశ్చేతన పనులు చేపడుతున్నామని ఆమె వెల్లడించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూగర్భ జల మట్టం విపరీతంగా పెరిగినట్లు గుర్తించారు.



దుర్గమ్మకు బంగారు ఆభరణాలతో ముస్తాబు



సీతారామ ఆశ్రమంలో దుర్గాదేవిగా



వాసవి కన్యకా పరమేశ్వర దేవస్థానంలో దుర్గాదేవిగా



బాలాజీక్యాంపు పార్వతిదేవికి దుర్గాదేవి అలంకరణ



ఆదిశక్తిగా గంగాపరమేశ్వరీ



వీణాపాణిగా రేడియో పార్కు పార్వతిదేవి



మహాదుర్గదేవిగా చిన్నదుర్గమ్మ



కారటగి: దేవిక్యాంపు రత్నగిరిపై దుర్గాదేవిగా శ్రీదేవి



కారటగి: బసవణ్ణ క్యాంపులో కొర్రమ్మ దేవి


కరుణించు మాతా..కనకదుర్గా



విద్యుత్తు దీపాలతో దుర్గమ్మ దేవస్థానం అలంకరణ

బళ్లారి, న్యూస్‌టుడే: నగర ఆరాధ్య దైవమైన కనకదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా గురువారం భక్తులకు బంగారు ఆభరణాలతో దర్శనం ఇచ్చింది. తెల్లవారుజామున అమ్మవారికి విశేష అలంకరణ, పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మను దర్శనం చేసుకున్నారు. దుర్గమ్మ దేవస్థానాన్ని పుష్పాలు, విద్యుత్తు దీపాలతో విశేషంగా అలంకరించారు. దుర్గమ్మ దేవస్థానం బయట అమ్మవారిని మహాగౌరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చింది. దేవస్థానానికి తరలివచ్చిన మహిళ భక్తులకు ఉచితంగా గాజులు వితరణ చేశారు. దేవస్థానం బయట పలువురు దాతలు ప్రసాదం వితరణ చేశారు. బంగారు అలంకరణ చేయడంతో డీఎస్పీ చంద్రకాంత్ నందరెడ్డి నేతృత్వంలో గాంధీనగర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం అమ్మవారు మహాదుర్గాదేవి రూపంలో అలంకరించి పూజలు జరిపారు. కనకదుర్గమ్మకు సువర్ణకవచంతో అలంకరించారు. రేడియోపార్కు పార్వతిదేవి, అవంబావి తుల్జాభవాని, ఏళుమక్కళతాయిలకు సరస్వతి దేవి అలంకరణ, గంగా పరమేశ్వరీకి ఆదిశక్తి, బాలాజీ క్యాంపు పార్వతికి దుర్గాదేవి, వాసవీమాత, పెద్దమ్మతల్లికి దుర్గామాతగా, చిన్నదుర్గమ్మ మహాదుర్గగా, శృంగేరి శారదామాతకు శాకంబరిగా, మారెమ్మకు గవ్వలతో, రుక్మిణీదేవికి భవానిమాత, కన్యకాపరమేశ్వరీ, నీలకంఠేశ్వరి, నగరేశ్వరీ, మల్నాడుదుర్గమ్మ, పెద్దమ్మ తల్లికి విశేషంగా అలంకరించి పూజించారు.



హొసపేటె: పటేల్‌నగర్‌లో కొలువుదీరిన దుర్గాపరమేశ్వరి అమ్మవారు

కారటగి: దేవిక్యాంపు రత్నగిరిపై గురువారం అష్టమి నాడు శ్రీదేవి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాగౌరీ పూజ, దుర్గాహోమం జరిగాయి. బసవణ్ణ క్యాంపులోని కొర్రమ్మ దేవికి ప్రత్యేక పూజలు జరిగాయి.

● శ్రీరామనగర్‌లో కనకదుర్గాదేవిని విశేషంగా అలంకరించి పూజలు జరిపారు. ఆరో వార్డు సంతోషిమాత ఆలయంలో సైతం పూజలు జరిగాయి.

● కంప్లిలోని గౌసముద్ర మారెమ్మ దేవికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. వాసవీ మాత, శ్రీదేవి, నిమిషాంబ దేవి ఆలయాల్లో సైతం పూజలు జరిగాయి.

హొసపేటె: శరన్నవరాత్రి ఉత్సవాలను పట్టణంలో వాడవాడలా ఘనంగా ఆచరిస్తున్నారు. దశమి సమీపిస్తున్న కొద్దీ ఉత్సవాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అమ్మవారి ఆలయాల్లో సందడి నెలకొంది. ఏడు కేరి(వాడ)ల్లో ఒకటైన మ్యాసకేరిలో కొంగమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. పటేల్‌నగర్‌లో దుర్గాపరమేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



బళ్లారిలో భక్తులకు ప్రసాద వితరణ

సింధనూరు: నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తాలూకాలోని తెలుగువారి క్యాంపుల్లో దుర్గాదేవి ఆలయాలు పూజలతో కళకళలాడుతున్నాయి. గురువారం గాంధీనగర్‌లో అమ్మవారిని శాకాంబరిగా దర్శనమిచ్చారు. వెంకటేశ్వరపైక్యాంపులో శ్రీవాసవీ సహిత హరిహరాత్మజ క్షేత్రంలో వాసవీ అమ్మవారికి భక్తులతో అభిషేకం చేయించిన అర్చకులు ఆపై అలంకారం చేశారు. వెంకటగిరిక్యాంపులోని శ్రీసిద్ధేశ్వర ఆశ్రమంలో అమ్మవారిని కాళికాదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీరామనగర్‌లో కనక దుర్గాదేవి



శ్రీరామనగర్‌లో సంతోషిమాత



కంప్లిలో గౌసముద్ర మారెమ్మ



సిరుగుప్ప: దుర్గాదేవి అలంకరణలో తాయమ్మదేవి



సిరుగుప్ప: శ్రీనగర్ క్యాంపులో దుర్గాదేవిగా



సింధనూరు: గాంధీనగర్‌లో శాకాంబరి దేవి



సింధనూరు: వెంకటేశ్వర పైక్యాంపులో వాసవీమాత



మారెమ్మకు గవ్వలతో అలంకరణ



కృష్ణానగర క్యాంపులో అమ్మవారు

బళ్ళారి
• బళ్ళారి • రాయచూరు



ప్రదర్శన నిర్వహిస్తున్న నాగరిక పోరాట సమితి

గిణిగెరా సమస్యలు పరిష్కరించండి

గంగావతి: పలు పరిశ్రమలు ఉన్న గిణిగెరా గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చాలని నాగరిక పోరాట సమితి గురువారం ప్రదర్శన నిర్వహించింది. కార్ఖానాల కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, స్థానిక ఆసుపత్రిని సముదాయ ఆరోగ్య కేంద్రంగా మార్చాలని కోరారు. గిణిగెరా, గబ్బూరు, కూకనపల్లి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రముఖులు శరణు గడ్డి, మైనేశ్, సురేశ్ కలాల్, అనురాధ, చిక్కప్ప పాల్గొన్నారు.

నీటిపారుదల సమావేశం నిర్వహించాలని వినతి


అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

బళ్లారి, న్యూస్‌టుడే: తక్షణమే తుంగభద్ర జలాశయ నీటిపారుదల సమావేశం నిర్వహించి ఎల్లెల్సీకి రెండో పంటకు నీటిని విడుదల చేయాలి. హెచ్చెల్సీకి ఫిబ్రవరి వరకు నీటిని విడుదల చేయాలని తుంగభద్ర రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తుంగభద్ర మండలి అధికారులకు వినతిపత్రం అందజేశారు. గతేడాదిలో తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ తక్కువగా ఉండటంతో రెండో పంటకు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సారి నీటిని విడుదల చేయడానికి త్వరగా నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తమగౌడ, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి

బళ్లారి, న్యూస్‌టుడే: బాలికలు 18 ఏళ్లలోపు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి.. లేకపోతే బాల్యవివాహాలతో గర్భం దాల్చితే తల్లి, బిడ్డలు అనారోగ్యంబారిన పడే ప్రమాదం ఉంది. దీన్ని తల్లిదండ్రులు గుర్తించి 18 ఏళ్ల పైబడిన బాలికలకు వివాహం చేయాలని జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా సూచించారు. జిల్లా స్థాయి సమితి సమీక్ష సమావేశానికి డీసీ అధ్యక్షత వహించి మాట్లాడారు. గర్భిణి అని తెలిసిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఫలితంగా వైద్యులు సరైన సమయంలో చికిత్స అందజేస్తారన్నారు. ఐరన్ లోపాలను సరిచేయడానికి ఔషధాలు అందజేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేయించాలన్నారు. బాల్య వివాహాలు నిషేధ చట్టంపై సంబంధిత అధికారులు, సిబ్బందికి నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖాధికారి డా.రమేష్‌బాబు, వైద్యులు బసరెడ్డి, వీరేంద్రకుమార్, మంజునాథ, హనుమంతప్ప పాల్గొన్నారు.

నగర దారులపై నరక యాతన

- నిత్యం ట్రాఫిక్ పద్మవ్యూహం
- నియంత్రణలో పోలీసుల విఫలం


దుర్గమ్మ దేవస్థానం భూగర్భ వంతెనపై నిలబడిన వాహనాలు


డబుల్ రహదారిలో నిలబడిన వాహనాలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరంలో పెరుగుతున్న వాహనాలకు తగినట్లు రహదారులు విస్తరణ లేకపోవడం.. అడ్డదిడ్డంగా ఫుట్‌పాత్ బండ్ల వ్యాపారం..వాహనాలు పార్కింగ్..పాదచారులు వెళ్లే ఫుట్‌పాత్ ఆక్రమణతో నగరంలో ట్రాఫిక్ నిత్యం పద్మవ్యూహంలా తయారవుతోంది. బళ్లారి నగర నడిబొడ్డున దుర్గమ్మ దేవస్థానం నుంచి ఈడిగ హాస్టల్ వరకు ఉన్న భూగర్భ వంతెన ఉండటంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. మరో భూగర్భ వంతెన నిర్మాణానికి బుడా రెండేళ్ల క్రితం రూ.8.80 కోట్ల డీడీని రైల్వేశాఖకు అప్పగించినా..నేటికీ పనులు ప్రారంభించలేదు. మరో వైపు దుర్గమ్మ గుడి భూగర్భ వంతెన మరమ్మతుల పేరుతో ఉన్న ఫుట్‌పాత్‌లను తొలగించి, విడిచి పెట్టారు. జబు పాదచారులు వెళ్లడానికి ఇబ్బంది, వాహనాలు వెళ్లడానికి మరింత క్లిష్టంగా ఉంది. దుర్గమ్మ గుడి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఉండటంతో భక్తుల సందడి పెరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భూగర్భ వంతెన మార్గంలో వాహనాలు నిలబడిపోయి తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. గడిగి చెన్నప్ప కూడలి నుంచి ఇంఫాంట్ కూడలి (బళ్లారి రామిడి) వెళ్లే డా.రాజ్‌కుమార్ రహదారి పనులు జరుగుతుండటంతో వాహనాలను మొత్తం పాత కోర్టు రహదారి, కె.సి.రహదారికి మళ్లించడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమైంది. మీనాక్షి కూడలి, కె.సి.రహదారిలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకుంటుంది. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా..ట్రాఫిక్ నియంత్రణ చేయలేకపోతున్నారు. స్టేషన్ రహదారిలోని ఎస్పీటీఏ ముందు పెద్ద చెట్టు ఉండటంతో అక్కడే మొత్తం వాహనాలు పార్కింగ్, తోపుడు బండ్లు నిలబడి వ్యాపారం చేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనిపై ట్రాఫిక్ పోలీసులు నేటి వరకు నియంత్రణ చేయలేకపోతున్నారు. ఎస్పీ దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా..నగరంలో రహదారుల మరమ్మతులు జరుగుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణ చేయలేకపోతున్నట్లు తప్పించుకుంటున్నారు.

ప్రధాన కూడలికి రేణుకాచార్య పేరు పెట్టాలి


మేయర్ ముల్లంగి నందీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం అధ్యక్షులు, స్వామీజీ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికెలోని ప్రధాన కూడలికి వీరశైవ ధర్మ సంస్థాపకుడు ఆది జగద్గురు రేణుకాచార్య పేరు పెట్టాలని అఖిల కర్ణాటక బేడ జంగమ్మ సంఘటనలు సంఘం నేతృత్వంలో గురువారం నగర పాలికె మేయర్ ముల్లంగి నందీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీరశైవ మత సంస్థాపకుడు రేణుకాచార్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల నుంచి అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. నగరంలోని బసవేశ్వరనగర రెండు ముఖ్య రహదారుల్లోని కూడళ్లలో ఒకదానికి రేణుకాచార్య పేరు పెట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు బసయ్యస్వామి, కల్యాణస్వామి, సభ్యులు కోటయ్య స్వామి, సిద్ధలింగమూర్తి, చంద్రమౌళి పాల్గొన్నారు.

వీలింగ్ అడ్డుకున్నందుకు పోలీసులపై దాడి


గంగావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులు


నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గంగావతి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వీలింగ్‌ను అడ్డుకున్నందుకు యువకులు పోలీసులపై దాడి చేసిన సంఘటన బుధవారం సాయంత్రం గంగావతి తాలూకా దాసనాళ గ్రామం వద్ద జరిగింది. ఆ సమయంలో యువకులందరూ గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. హేమగుడ్డలో దసరా ఉత్సవాల భద్రతకు వెళ్లి పోలీసులు తిరిగొస్తుండగా కొందరు యువకులు వీలింగ్ చేస్తూ కనిపించారు. వీరిని నివారించి అలా చేయడం తప్పు అని చెప్పడంతో పోలీసులపై దాడికి దిగారు. ఎస్సై పుండప్ప, హెడ్ కానిస్టేబల్ బసవరాజ్ మీసె, పోలీసు వాహనం చోదకుడు కనకప్ప ఈ సంఘటనలో గాయపడ్డారు. గ్రామస్థులు జోక్యం చేసుకుని యువకుల నుంచి పోలీసులను కాపాడారు. యువకుల గుంపులో ముగ్గురిని గ్రామస్థులే పట్టుకుని పోలీసులకు అప్పగించారు.. వీరిని గంగావతి పట్టణంలోని గుండమ్మ క్యాంప్‌కు చెందిన అర్బాజ్‌ఖాన్ (26), కిల్లా ఏరియా శరణేగౌడ (24), శివె కాలనీ వెంకటేశ్ (25) గుర్తించారు. మిగిలిన వారు పరారీలో ఉన్నారు. దీనికి సంబంధించి గంగావతి గ్రామీణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది.


గూగిబండక్యాంప్ త్రిశక్తి స్వరూపిణీ అలంకరణ


చండికా హోమంలో పాల్గొన్న పరణ్ణ మునవళ్లి

గూగిబండక్యాంపులో చండికా హోమం

గంగావతి,న్యూస్‌టుడే: గంగావతి తాలూకా గూగిబండక్యాంప్ దేవీ ఆలయంలో గురువారం చండికాహోమం ఆచరించారు. మాజీ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్ళి పూర్ణాహుతి నెరవేర్చారు. అమ్మవారికి అభిషేకం చేసి దుర్గామాతగా అలంకరించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పద్మక్క, శేషారావ్, రాంబాబు, సూర్యనారాయణ పాల్గొన్నారు. గంగావతి పట్టంలోని మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారు దుర్గామాతగా దర్శనం ఇచ్చారు.

రైలు ఢీకొని మహిళ మృతి

హొసపేటె: గేటు వేసినప్పటికీ, ఆత్రుతతో పట్టాలు దాటుతున్న దుర్గమ్మ(50) అనే మహిళను రైలు ఢీకొంది. తీవ్ర గాయాలైన ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. ఈ ఘటన హగరిబొమ్మనహళ్లిలో జరిగింది. కొట్టూరు తాలూకా కుడుతినిమగ్గి గ్రామానికి చెందిన దుర్గమ్మ కాళ్ల నొప్పుల చికిత్స కోసం హగరిబొమ్మనహళ్లి వచ్చారు. రామనగర వద్ద రైలు వస్తుండగా గేటు వేశారు. గేటు కింద నుంచి దూరి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ ఘటనపై బళ్లారి రైల్వేపోలీస్ ఠాణాలో కేసు నమోదైంది.

కాలుజారి చెరువులో పడి మహిళ ..

గంగావతి: చెరువులో కాలుజారి పడి మహిళ మృతిచెందిన సంఘటన కొప్పళ జిల్లా, కుకునూరు తాలూకా బన్నికొప్ప గ్రామంలో గురువారం జరిగింది. దసరా పండుగకు పుట్టినింటికి వచ్చిన గౌరమ్మ(23) శరవన్నవరాత్రుల పూజ కోసం వేకువజామున గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లింది. పూజ చేస్తుండగా కాలుజారి పడిపోయింది. కల్లూరు గ్రామానికి చెందిన కల్లేశ్‌తో గౌరమ్మకు వివాహం జరిగింది. వారికి నాలుగు నెలల పాప ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుకునూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

కలెక్టర్ పేరుమీద నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ పేరుమీద నకిలీ ఫేస్‌బుక్ ఖాతా ప్రారంభించి పలువురికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపినట్లు కలెక్టర్ దివాకర్ గుర్తించారు. కలెక్టర్ పేరుమీద నకిలీ ఫేస్‌బుక్ ఖాతా ప్రారంభించడం ఇది మూడో సారి. నా ఫోటో వాడి నకిలీ ఖాతా ప్రారంభించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవలే విజయనగర ఎస్పీ శ్రీహరిబాబు పేరుమీద నకిలీ ఫేస్‌బుక్ ఖాతాను ప్రారంభించడం తెలిసిందే.

‘ఉప కాలువలకు నీరు విడుదల చేయాలి’


రోడ్డుపై బైఠాయించిన రైతులు

మాన్వి, న్యూస్‌టుడే : తుంగభద్ర ఎడమ కాలువ పరిధిలోని ఉపకాలువలకు నీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు గురువారం సిరివార పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం గౌరవాధ్యక్షుడు చామరస్‌మాలీపాటిల్ మాట్లాడుతూ తాలూకాలో నీటిపారుదల, మెట్ట సేద్యం చేస్తున్న రైతులకు నీరు సరిగా అందక పంటలు ఎండిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు పోరాటం చేసినా, అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదన్నారు. అప్పులు చేసి పంటలను సాగుచేసుకుంటున్నారని, రుణబాధలు భరించలేక ఆత్మహత్యల సంఘటనలు తాలూకాల్లో చోటు చేసుకున్నాయని విచారం వ్యక్తం చేశారు. నీటి పారుదలశాఖ అధికారులు పూర్తిగా విఫలం చెందారని నిందించారు. రైతుల పొలాలకు నీరు చేరే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు. తహసీల్దార్ రవి రైతుల వద్దకు వచ్చి చర్చించారు. నీటి విషయంలో జరుగుతున్న తారతమ్యాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామని బరోసా ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. ఆల్దాళ, అమరావతి, గవిగట్టు, జానేకల్ తదితర గ్రామాలకు చెందిన రైతులు, రైతు సంఘం సభ్యులు, కార్యకర్తలు రాస్తారోకోలో పాల్గొన్నారు.

పలు ఠాణాల పరిధిలో మద్య నిషేధం

హొసపేటె, న్యూస్‌టుడే: దసరా పండగ శాంతియుతంగా ఆచరించేందుకు, ముందు జాగ్రత్త చర్యగా పట్టణంలోని పలు పోలీస్ ఠాణాల పరిధిలో మద్యంపై నిషేధాన్ని విధిస్తూ జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ ఆదేశాలు జారీ చేశారు. కమలాపుర, హంపీ, హొసపేటె గ్రామీణ, పట్టణం, టీబీడ్యాం, చిత్తవాడ్గీ ఠాణాల పరిధిలో 11వ తేదీ ఉదయం 6 నుంచి 12వ తేదీ ఉదయం 6గంటల వరకూ మద్యంపై నిషేధాన్ని విధించారు. ఈ వేళల్లో అబ్కారీ అధికారులు నిఘా తీవ్రం చేయాలని డీసీ ఆదేశాల్లో సూచించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


సీనియర్ సివిల్ న్యాయమూర్తి రూపను సత్కరిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

సింధనూరు, న్యూస్‌టుడే: ఎటువంటి ఒడదుడుకులు ఎదురైనా కుంగిపోరాదు..ధైర్యంగా ఎదుర్కొవాలి, జీవితంలో గెలుపోటములను సమానంగానే స్వీకరించాలని సింధనూరు సీనియర్ సివిల్ న్యాయమూర్తి రూప విద్యార్థులకు హితవు పలికారు. స్థానిక పీడబ్ల్యూడీ క్యాంపులోని సన్‌రైజ్ ఫార్మసీ కళాశాలలో గురువారం విశ్వ మానసిక ఆరోగ్య దినం ఆచరించారు. అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి రూప మాట్లాడుతూ మనిషి జీవితాన్ని గులాబీ పూవుతో పోల్చారు. జీవితం అందంగానే కనిపించినా..కష్టాలనే ముళ్లు గుచ్చుకుంటూ ఉంటాయని అన్నారు. విద్యార్థులు తలెత్తుకుని బతికే జీవితం కావాలంటే పుస్తకాల వద్ద తలలు దించి చదవాలి, అతిగా చరవాణుల జోలికి వెళ్లకండని సూచించారు. మరో సివిల్ న్యాయమూర్తి అచ్చప్ప దొడ్డబసవరాజ్, కళాశాల అధ్యక్షుడు ఇర్ఫాన్, ప్రాచార్యుడు లాజర్ సిరిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీనివాస కల్యాణం



శ్రీరామనగర్, న్యూస్‌టుడే: విజయదశమి ఉత్సవాల సందర్భంగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడో తేదీ నుంచి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. గురువారం విష్ణు సహస్రనామ పారాయణంతో హోమం నిర్వహించారు. శుక్రవారం రాత్రి గరుడోత్సవం, స్వామి కల్యాణం జరగనున్నాయి. శనివారం బ్రహ్మోత్సవం ఉంటుందని ఆలయ సేవా సమితి, గురురాజ భజనా మండలి సభ్యులు తెలిపారు.

ప్రాణం తీసిన మద్యం వ్యసనం

హొసపేటె, న్యూస్‌టుడే: మద్యం వ్యసనం ఓ వ్యక్తి ప్రాణాలను తీసింది. తాగుడుకు అలవాటుపడిన బళ్లారి నింగప్ప(50) అనే వ్యక్తి మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హడగలి తాలూకా హొళలులో వెలుగు చూసింది. ఆ ప్రాంతానికి చెందిన వ్యవసాయ కూలీ బళ్లారి నింగప్ప తాగుడుకు అలవాటుపడ్డారు. మద్యసేవనకు డబ్బులివ్వమని కుటుంబ సభ్యులను వేధించేవాడు. వారు తీవ్రంగా మందలించారు. 7వ తేదీ బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. బుధవారం రాత్రి ఊరి శివారులోని చెట్టుకు ఉరేసుకున్న స్థితిలో కనిపించాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన హిరేహడగలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు


అదృశ్యమైన మేఘరాజ

బళ్లారి: బళ్లారి తాలూకా గుడుదూరు గ్రామానికి చెందిన మేఘరాజ(23) అనే యువకుడు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు బళ్లారి తాలూకా మోకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేఘరాజ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.


నృత్యకళాకారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరిస్తున్న గంగాపరమేశ్వరీ దేవస్థానం అధ్యక్షుడు మౌలాలి, తదితరులు

మన సంప్రదాయాలను కొనసాగించాలి

బళ్లారి గ్రామీణ: మన సంప్రదాయ కళలను కాపాడుకోవాలని గంగా పరమేశ్వరీ దేవస్థానం అధ్యక్షుడు మౌలాలి పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విద్యానగర్ గంగామాత ఆలయంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న మన సంప్రదాయాలు, సంస్కృతికి ముందు తరాలకు అందించేందుకు ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తుంగా గంగా సాంస్కృతిక అకాడమీ కళాకారులు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన, లలిత సహస్రనామ పఠనం భక్తులను తన్మయ పరిచింది. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు, భక్తులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు మాజీ మంత్రి ఓదార్పు

హొసపేటె, న్యూస్‌టుడే: కూడ్లిగి తాలూకా కుమతిలో మంగళవారం చెరువులో పడి మృతిచెందిన ముగ్గురు బాలుల కుటుంబాలను మాజీ మంత్రి బి.శ్రీరాములు గురువారం పరామర్శించారు. పూరి గుడిసెలో నివాసం ఉంటూ, కూలి పనులకు వెళ్తూ ఇద్దరు పుత్రులను పోషిస్తున్న దంపతులు జయణ్ణ, లక్ష్మీ ఈ సందర్భంగా మాజీ మంత్రి ముందు తీవ్రంగా విలపించారు. ‘తమకెంత కష్టమున్నా, పిల్లల మొహం చూసుకుని కాలం వెళ్లదీస్తున్నాం. ఇప్పుడు వారే లేరంటే ఎవరికోసం బతకాలని’ కన్నీరుమున్నీరయ్యారు. అధైర్య పడాల్సిన అవసరం లేదు, మీకు వెన్నుదన్నుగా ఎల్లప్పుడూ ఉంటామని శ్రీరాములు ధైర్యం నూరిపోశారు.


కూడ్లిగి తాలూకా కుమతిలో బాలల తల్లిదండ్రులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి బి.శ్రీరాములు


నూతన కార్యాలయం వద్ద అధికారులు, సభ్యులు

పట్టణ పంచాయతీ కార్యాలయం ప్రారంభం


సిరివార, (మాన్వి), న్యూస్‌టుడే : పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న పట్టణ పంచాయతీ కార్యాలయాన్ని మార్చారు. మాన్వి క్రాస్ వద్ద నూతన పట్టణ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. గురువారం నూతన భవనం వద్ద పట్టణ పంచాయతీ అధికారులు, సభ్యులు ప్రత్యేక పూజలు చేసి ప్రవేశించారు. పట్టణ పంచాయతీ ముఖ్యాధికారి శశిధర్‌స్వామి, తహసీల్దార్ రవి ఎస్ అంగడి, యోజనాధికారి చన్నవీరప్ప, సభ్యులు పాల్గొన్నారు.

శౌచాలయం కూల్చివేతపై నిరసన

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని 20వ వార్డు ఆదాపూరుపేటలోని సామూహిక మహిళా శౌచాలయాన్ని కూల్చివేయటంపై వార్డుకు చెందిన మహిళలు ఆందోళనకు దిగారు. గురువారం మహిళలు స్థానిక పురపాలక సంఘం కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. మహిళా శౌచాలయాన్ని యంత్రాలతో కూల్చివేయటం దారుణమన్నారు. విషయం తెలిసి కూడా సంఘం ముఖ్యాధికారి మౌనం దాల్చారని నిందించారు. కూల్చివేసిన శౌచాలయాన్ని తిరిగి పునర్మించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో 20వ వార్డు సభ్యుడు వెంకటేశ్‌నాయక్, వార్డు మహిళలు రాఘమ్మ, నరసమ్మ, లక్ష్మీ, ఉరుకుందమ్మ, హుసేనమ్మ, బస్సమ్మ తదితరులు పాల్గొన్నారు.


పురపాలక కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

మూడు నామినేషన్ల సమర్పణ


రిటర్నింగ్ అధికారి దేవేంద్రగౌడకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న అభ్యర్థి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముగ్గురు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ధర్మేంద్ర గౌడ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురువారం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 22 శాఖల నుంచి 34 నిర్దేశకుల కోసం నిర్వహించే ఈ ఎన్నికల్లో 18 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

పారిశ్రామిక రంగ దిగ్గజం.. రతన్


రతన్‌టాటా చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: సంజీవరాయన కోటె ప్రభుత్వ పాఠశాలలో గురువారం రతన్ టాటా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. భరతమాత ముద్దుబిడ్డగా ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచిన వాణిజ్య శిఖరం రతన్ టాటా అని ఉపాధ్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు రవి అన్నారు. ఆయన ఆదర్శజీవితం తరతరాలుగా ప్రేరణగా నిలుస్తోందన్నారు.

సిరుగుప్ప: రతన్‌టాటా మృతి దేశానికి తీరనిలోటని మాజీ శాసనసభ్యుడు ఎం.ఎస్.సోమలింగప్ప పేర్కొన్నారు. పట్టణంలో గురువారం భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. దేశంలో, ప్రపంచ వ్యాప్తంగా టాటా కంపెనీ ద్వారా అనేక కర్మాగారాలు, పరిశ్రమలు నెలకొల్పి విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించారని కొనియాడారు. భాజపా తాలూకా అధ్యక్షుడు కుంట్నాళ్ మల్లికార్జున స్వామి, నగరసభ సభ్యులు మహదేవ, మురళి మనోహర్ రెడ్డి, నటరాజ, మైకేలి విరేశ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బళ్లారి: భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతికి పలువురు నివాళులర్పించారు. గురువారం బళ్లారి వాణిజ్య పరిశ్రమల సంస్థ ఆధ్వర్యంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రతన్ టాటా చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు యశవంత్‌రాజ్ నాగిరెడ్డి, గౌరవ ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావ్, సభ్యులు మార్చేడు మల్లకార్జునగౌడ, జితేంద్రప్రసాద్, మహారుద్రగౌడ, సొంతగిరిధర్, రమేష్, రామచంద్రప్ప దొడ్డ బసవనగౌడ, సత్యబాబు, మంజునాథ, నాగరాజు, శ్రీనివాసరావ్ తదితరులు పాల్గొన్నారు.


రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళుర్పిస్తున్న మాజీ శాసనసభ్యుడు సోమలింగప్ప, ఇతర నాయకులు


బళ్లారిలో రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

10-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.92	1615.71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,784	1374
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	14,981	9,384
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.461	50.122

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఆయుధ పూజకు పూల తోరణాలు



ఆసియా ఖండంలోనే అతి పెద్ద బెంగళూరు పూల విపణి కళకళ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ఆయుధపూజ, దసరా పండగ కొనుగోళ్లతో బెంగళూరు విపణి వీధులు కళకళలాడాయి. సిటీ మార్కెట్, మల్లేశ్వరం, యశ్వంతపుర, బసవనగుడి, కేఆర్‌పురం విపణులకు వచ్చిన పూలు, పండ్లు, తోరణం ఆకులు, అరటిబోదెలు, బూడిద గుమ్మడికాయల కొనుగోళ్లు జోరుగా సాగాయి. పీణ్య, కామాక్షిపాళ్య, కనకపుర రోడ్డు, బొమ్మనహళ్లి, దొమ్మసంద్ర, మాకళి తదితర ప్రాంతాల్లోని పారిశ్రామికవాడల్లో శుక్రవారం ఆయుధ పూజకు యంత్రాలను గురువారమే శుభ్రం చేశారు. యంత్రాలకు పూల హారాలతో అలంకరణలు చేశారు. విద్యాసంస్థలు, కార్యాలయాలకు సెలవు ఉండడంతో బెంగళూరుకు సమీపంలోని జిల్లాలకు ఎక్కువ మంది తరలి వెళ్లారు. వాహనాలకు పూజలు చేసుకునేందుకు వాటిని సర్వీస్ స్టేషన్లకు వాహనదారులు తరలి వచ్చారు. ధరలకు వెనకడుగు వేయకుండా నగరవాసి పండగకు కావలసిన నిత్యావసరాలు, మిఠాయిలు, పూలు, తదితరాలను కొనుగోలు చేసుకున్నారు. ఇళ్ల ముందు కట్టుకునేందుకు, పరిశ్రమల్లో దిష్టి కాయల కోసం బూడిద గుమ్మడి కాయల కొనుగోలుకు ఎక్కువ మంది ముందుకు వచ్చారు. నగరంలోని అన్ని దుకాణాల వద్ద పండగ వాతావరణం కనిపించింది.



అరటి బోదెల కొనుగోళ్ల జోరు



మల్లేశ్వరం మార్కెట్లో విక్రయానికి పూల హారాలు

శక్తిసౌధకు పండగ కళ



తన కార్యాలయంలో పూజ చేయించుకుంటున్న మంత్రి సంతోష్ లాడ్

బెంగళూరు (శివాజీనగర) : విధాన, వికాససౌధల్లోని మంత్రుల కార్యాలయాలకు పండగ కళ వచ్చింది. కొందరు మంత్రులు స్వయంగా ఆయుధ పూజను నిర్వహించుకోగా, మరికొన్ని కార్యాలయాలలో వ్యక్తిగత సిబ్బంది పూజలు చేశారు. సంతోష్ లాడ్, డాక్టర్ పరమేశ్వర్‌లు కార్యాలయాలను శుభ్రం చేయించుకుని అర్చకులను పిలిపించుకుని పూజలు చేసుకున్నారు. పూజల అనంతరం దిష్టి తీసి బూడిద గుమ్మడికాయల్ని కొట్టారు. అధికారులు, మంత్రులు తమ కార్లకు పూజ చేయించుకుని, విధానసౌధలోనే వాటిని వదిలి సొంత వాహనాల్లో ఇళ్లకు తిరిగి వెళ్లారు. పోలీసు కమిషనర్ కార్యాలయం, పోలీసు ఠాణాలలో శుక్రవారం ఆయుధపూజలకు గురువారమే ఏర్పాట్లు చేసుకున్నారు. నేటి నుంచి మూడు రోజులు సెలవు ఉండడంతో గురువారం మధ్యాహ్నానికే ప్రభుత్వ కార్యాలయాలలో పూజలను పూర్తి చేశారు.



తన కార్యాలయంలో పూజ చేయించుకుంటున్న మంత్రి పరమేశ్వర్

బొమ్మల పండగ!

రాజధాని నగర పరిధిలోని మల్లేశ్వరం, బసవనగుడి, బనశంకరి ప్రాంతాల్లో బొమ్మల కొలువుల ఏర్పాటుకు నగరవాసి పోటీ పడుతున్నాడు. తమ కుటుంబ సభ్యులతో కలిసి కొనుగోలు, సేకరించుకున్న బొమ్మలను కొలువులో వరుసగా పేర్చుకుని, ఇరుగు- పొరుగులను ఆహ్వానించి, తమ సేకరణ వివరాలను గృహిణులు వివరిస్తున్నారు. కొలువులోని దేవతల విగ్రహాలకు నిత్యం హారతి ఇస్తూ, తమ ఇష్టదైవాలకు పూజలు చేస్తున్నారు. కొందరు అధికారులు కూడా తమ నివాసాల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేసుకున్నారు.

-న్యూస్‌టుడే, మల్లేశ్వరం



మల్లేశ్వరం: ఓ ఇంట బొమ్మలకొలువు సందడి



వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన బొమ్మలు



ఓ మహిళ సిద్ధం చేసిన వేదిక అబ్బురమే..



బొమ్మల కొలువు వద్ద కుటుంబ సభ్యులు



బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

- బీన్స్- 100
- క్యారెట్- 75
- బీరకాయలు- 40
- క్యాబేజి- 20
- కాలీఫ్లవర్(ఒక్కోటి)- 25
- సొరకాయ- 35
- దొడ్డకాయలు- 28
- పొట్లకాయ- 35
- టమాటా(నాటు)-110
- టమాటా (సాధారణ)-90
- గుమ్మడి- 55
- ఆలుగడ్డ- 45
- ఉల్లి (మేలురకం)-85
- ఉల్లి (మామూలు)-50
- తెల్లగడ్డలు- 405
- సాంబారు ఉల్లి- 120
- బీట్‌రూట్- 25
- వంకాయలు- 35
- బెండకాయలు- 28
- ముల్లంగి- 40
- నిమ్మకాయ- 250
- వాషింగ్టన్ ఆపిల్:315
- సిమ్లా ఆపిల్- 155
- గ్రీన్ ఆపిల్- 335
- అరటి కాయలు- 55
- సపోటా- 45
- ఫైనాపిల్- 40
- బొప్పాయి- 45
- ఆరంజి- 80
- బత్తాయి- 75

బస్సులన్నీ కిటకిట

30 శాతం పెరిగిన ప్రయాణికులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా వాహనాలన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో సొంతంగా టికెట్లను కొనుగోలు చేసుకునే వారి సంఖ్య రాష్ట్ర వ్యాప్తంగా 30 శాతం పెరిగిపోయింది. అక్టోబరు 10 నుంచి 14 మధ్యలో బెంగళూరు నుంచి ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల నుంచి ఉద్యాననగరికి ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేస్తున్న వారి సంఖ్యను, బుకింగ్ పోకడలను గుర్తించేందుకు రెడ్‌బస్ తాను నిర్వహించిన అధ్యయన నివేదికను మంగళవారం విడుదల చేసింది. బెంగళూరు నుంచి హైదరాబాద్, చెన్నై, కోయంబత్తూరు, పాండిచ్చేరి, గోవాకు వెళ్లేందుకు ఎక్కువ మంది టికెట్లు కొనుగోలు చేసుకున్నారు. రాష్ట్ర పరిధిని పరిగణనలోకి తీసుకుంటే.. బెంగళూరు నుంచి మంగళూరు, ఉడుపి, కుందాపుర, బళ్లారి, గోకర్ణకు అత్యధికంగా టికెట్లు కొనుగోలు చేసుకున్నారు. వీరిలో 45 శాతం మంది ఏసీ బస్సులను, 55 శాతం మంది నాన్-ఏసీ బస్సులను ఎంచుకున్నారు. మడివాళ, మెజెస్టిక్, సిల్కు బోర్డు, యశ్వంతపుర, బళ్లారి రోడ్డు మెఖ్రీ కూడలి వద్ద ఎక్కువ మంది బస్సులు ఎక్కుతున్నారని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

పట్టాలెక్కిన మైసూరు రైలు

మైసూరు, న్యూస్‌టుడే : దసరాను పురస్కరించుకుని మైసూరు- అరసికెరె మధ్య ప్రత్యేక డెమో రైలు సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. శనివారం వరకు ఈ రైలు సేవలు కొనసాగనున్నాయి. భక్తులు, పర్యాటకులు దసరా వేడుకలను వీక్షించేందుకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మధ్యాహ్నం 2.30కి అరసికెరెలో బయలుదేరే రైలు సాయంత్రం 6.40కి మైసూరు చేరుకుంది. మైసూరులో 6.50కు బయలుదేరి రాత్రి 11.43కు అరసికెరె చేరుకుంది. హబ్బనఘట్ట, బాగేశపుర, హాసన, మావినకెరె, హొళెనరసీపుర, అనేచాకరనహళ్లి హాల్ట్, శ్రవణూరు హాల్ట్, మందగెరె, బీరహళ్లి హాల్ట్, అక్కి హెబ్బాళు, హొస అగ్రహార, అర్జునహళ్లి, హంపాపుర, కృష్ణరాజనగర, డోరనహళ్లి, సాగరకట్టె, కల్లూరు, కృష్ణరాజసాగర, బెళగుళ స్టేషన్లలో ఈ రైలు నిలుస్తుంది. పండగ సందర్భంలో ఈ రైలు సేవలను వినియోగించుకోవాలని నైరుతి రైల్వే అధికారులు ప్రయాణికులను కోరారు.

కస్తూరిబాయికి సర్వేపల్లి పురస్కారం



ప్రశంసా పత్రాన్ని, ట్రోఫీని ప్రదర్శిస్తున్న ఆచార్య కస్తూరిబాయి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : సీనియరు రచయిత్రి, కవయిత్రి ఆచార్య వై.కస్తూరిబాయికి దేవనగరి ఉత్థాన ఫౌండేషన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసింది. దేశంలోని 12 మందికి మాత్రమే ఈ ఏడాది ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. 'మిసెస్ యూనివర్స్ ఆసియా' పూజా నిగమ్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సునీల్ దూబే చేతుల మీదుగా కస్తూరిబాయి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'ల్లో పేరు నమోదుతో పాటు, ఇప్పటి వరకు 200కుపైన జాతీయ అవార్డులు, 50 వరకు అంతర్జాతీయ అవార్డులను కస్తూరిబాయి అందుకున్నారు.

మఠంలో విజయేంద్ర పూజలు



హోమంలో హవిస్సులు వేస్తున్న విజయేంద్ర

బెళగావి, న్యూస్‌టుడే : మహానవమి, విజయదశమి పండగలను పురస్కరించుకుని హుక్కేరి హిరేమఠంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు, హోమం, పూజల్లో భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర గురువారం పాల్గొన్నారు. 'ఈ పండగ అనంతరం కర్ణాటకలో ప్రతి ఒక్కరి నివాసం సిరి సంపదలతో తులతూగాలి' అని తాను కోరుకుంటున్నానని ఆయన చెప్పారు. చండికా యాగంలో హవిస్సులు వేశారు. మఠాధిపతి చంద్రశేఖర శివాచార్య మహాస్వామి నుంచి ఆశీస్సులు అందుకుని, పార్టీ నాయకులతో కలిసి ఆయనను సత్కరించారు. పార్టీ నాయకులు అనిల్ బెనక, దుర్యోధన ఐహోళె, నిఖిల్ కత్తి, మహంతేశ కవటగి మఠ, సంజయ్ పాటిల్ తదితరులతో కలిసి మఠంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు.

రాజీనామా చేస్తారు..

ముడా అక్రమాల్లో చిక్కుకున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పదవికి రాజీనామా చేసే కాలం చేరువయ్యిందని విజయేంద్ర వ్యాఖ్యలు చేశారు. విజయదశమి అనంతరం ఏ క్షణంలో అయినా ముఖ్యమంత్రి మార్పు ఉంటుందన్నారు. బెళగావి, బెళగావి గ్రామీణం, చిక్కోడి విభాగాల కోర్ కమిటీ సభ్యులతో ఆయన గురువారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిని మార్చక మునుపే ఆ పీఠాన్ని దక్కించుకునేందుకు కొందరు మంత్రులు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారని ఎద్దేవా చేశారు. బూత్ స్థాయి నుంచి సభ్యత్వాన్ని పెంచుకునేందుకు తీసుకుంటున్న కార్యక్రమాలపై కోర్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించామన్నారు.



మఠాధిపతిని సత్కరిస్తున్న విజయేంద్ర, ఇతర నేతలు



మాట్లాడుతున్న చలువాది నారాయణ స్వామి

వాస్తవాలు పక్కదారి..

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : పలు కుంభకోణాల్లో వాస్తవాలను పక్కదారి పట్టించేందుకు, కేసుల నుంచి బయట పడేందుకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు దళాలు ఏర్పాటు చేస్తూ.. అవసరమైతే సీఐడీకి బాధ్యతలు అప్పగిస్తోందని విధానపరిషత్తులో విపక్ష నాయకుడు చలువాది నారాయణస్వామి ఆరోపించారు. భాజపా ప్రధాన కార్యాలయం 'జగన్నాథ భవన్‌'లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి కార్పొరేషన్‌లో రూ.87 కోట్ల అక్రమాలు జరిగాయని సిద్ధరామయ్యే స్వయంగా అంగీకరించినా.. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కార్పొరేషన్ నుంచి దారి మళ్లించిన నగదులో రూ.20 కోట్లను బళ్లారి లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించారని ఆరోపించారు. ముడా నుంచి 14 ఇళ్ల స్థలాలను తీసుకోవడమే తప్పని న్యాయస్థానం పేర్కొందని, వాటిని తిరిగి వెనక్కు అప్పగిస్తే తప్పు ఒప్పయిపోతుందా అని ప్రశ్నించారు. సీబీఐ, ఈడీ దర్యాప్తుతోనే అన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు సిట్, సీఐడీలకు బాధ్యతలు అప్పగిస్తున్నారని విమర్శలు గుప్పించారు.

'కలబురగి' కేసులో ప్రభుత్వానికి తాఖీదులు

ధార్వాడ, న్యూస్‌టుడే : సీనియరు పరిశోధనకుడు ఆచార్య ఎంఎం కలబురగి హత్య కేసులో మూడో నిందితుడు ప్రవీణ్ బెయిలు కోసం వేసుకున్న అర్జీపై ఆక్షేపణలు తెలిపేందుకు ధార్వాడ హైకోర్టు పీఠం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో మొదటి నిందితుడు అమోల్ కాళే తూటాతో కలబురగిపై కాల్పులు జరిపాడనేది అభియోగం. హత్యకు ముందు, అనంతరం అతన్ని తన బైకులో ప్రవీణ్ తోడ్కొని వెళ్లాడు. రెండు సార్లు అతను బెయిలుకు వేసుకున్న అర్జీని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. మరోసారి వేసుకున్న అర్జీపై ఆక్షేపణలు తెలపాలని సూచిస్తూ జస్టిస్ ఎంజీ ఉమ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు.

అప్పులపాలై.. ఆత్మహత్యాయత్నం

దావణగెరె, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలిగా పని చేస్తున్న భారతి అనే మహిళ బలన్మరణానికి యత్నించింది. దావణగెరె డాంగే పార్కు వద్ద అంగన్‌వాడీలో ఆమె పని చేస్తోంది. మూడు నెలలుగా వేతనం రాకపోవడంతో తెలిసిన వారి వద్ద చేబదులు తీసుకుంది. అప్పు ఇచ్చిన వారి వేధింపులు తట్టుకోలేక విషం తాగింది. కుటుంబ సభ్యులు తక్షణమే ఆమెను చిగటేరి జిల్లాసుపత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. చిగటేరి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



బంగారు భార్గవ్

బెంగళూరు ఎంఎస్ రామయ్య ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ (స్ట్రక్చర్స్) విభాగంలో కందవార చంద్రశేఖర్ భార్గవ్ బంగారు పతకాన్ని అందుకున్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన 16వ స్నాతకోత్సవంలో రక్షణ శాఖకు విశ్రాంత సలహాదారుడు ఆచార్య అత్రే, కళాశాల ఛైర్మన్ ఎంఆర్ జయరాం భార్గవ్‌కు పతకాన్ని ప్రదానం చేశారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో భార్గవ్ టాపర్‌గా నిలిచాడు.

- న్యూస్‌టుడే, సదాశివనగర)

బోను అమర్చి.. గొళ్లెం వేశారు!

కార్వార, న్యూస్‌టుడే : హొన్నావర తాలూకా కవలక్కి గ్రామం చుట్టుపక్కల చిరుత సంచరిస్తోందని గ్రామస్థుల ఫిర్యాదుకు అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. గ్రామంలోకి వస్తున్న చిరుత పశువులు, జాగిలాలను చంపి తినడంతో స్థానికులు బయాందోళనకు గురయ్యారు. కవలక్కి గ్రామ శివార్లలో అటవీశాఖ సిబ్బంది కొన్ని బోనులను ఏర్పాటు చేశారు. అందులో ఎటువంటి ఎర ఉంచకుండా, బోనులకు గొళ్లాలను బిగించి ఉంచారు. వారం పాటు బోనులకు గొళ్లాలు వేసి ఉంచిన విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన సిబ్బంది నాలుక కరచుకున్నారు. గురువారం ఉదయం ఆ బోనుల గొళ్లాలను తెరచి, ఎరలను అందులో అమర్చి.. మళ్లీ వేట మొదలుపెట్టారు.



ద్వారం తెరవకుండా అమర్చిన బోను

'అటవీ' ఉద్యోగులకు వేతనాల మాటేంటి?

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : మూడు నెలలుగా తమకు వేతనాలు అందడం లేదని చిక్కమగళూరు విభాగం అటవీశాఖ సిబ్బంది ఆక్రోశించారు. భోజనం, ఇతర భత్యాలు, వేతనాలు తమకు రావడం లేదని తెలిపారు. వన్యప్రాణులు గ్రామాలపై దాడులు చేయకుండా నియంత్రించేందుకు అటవీశాఖలో సేవలందిస్తున్న కొందరు సిబ్బందితో ప్రభుత్వం ఈటీఎఫ్ దళాన్ని ఏర్పాటు చేసింది. ఏడు జిల్లాల్లో ఈటీఎఫ్ దళాలు సేవ చేస్తున్నాయి. ఈ జిల్లాల్లో సిబ్బంది అందరికీ గత మూడు నెలల నుంచి వేతనాలు అందలేదు.

ఉద్యానవనాల్లో చినుకులకు పాదులు



ఉద్యానవనంలో నిర్మించిన ఓ ఇంకుడు గుంత



నీటిని ఒడిసిపట్టేందుకు ఓ కార్యాలయ ఆవరణలో ఇలా

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఆకాశం నుంచి రాలే చినుకులు వృథాకాకుండా వాటిని భూమిలో ఇంకేలా బెంగళూరు పాలికె ప్రత్యేక పథకాలకు శ్రీకారం చుట్టింది. ఎక్కడికక్కడ వాననీటిని ఒడిసి పట్టడానికి వీలుగా వివిధ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు నిర్మిస్తోంది. ఈ పథకం విజయవంతమైతే భూగర్భజలాల మట్టం విపరీతంగా పెరిగి, వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తబోదని అధికారులు అంచనా వేస్తున్నారు. నగర ప్రజలు దాహార్తి తీర్చేందుకు కావేరి నీరు సరిపోవడం లేదు. సగం మంది భూగర్భ జలాలపై ఆధారపడుతున్నారు. వృథాగా పోతున్న వాననీటిపై పాలికె దృష్టి సారించింది. నగరవ్యాప్తంగా ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 634 ఇంకుడు గుంతలు తవ్వించారు. వచ్చే ఏడాది ఈ సంఖ్య వెయ్యికి తక్కువ ఆకకుండా చూడాలని పాలికె ప్రత్యేక కమిషనర్ ప్రీతి గహ్లోత్ వెల్లడించారు. పాలికె పరిధిలో 1280 ఉద్యానవనాలు విస్తరించాయి. వాటిలో 12 అడుగుల వెడల్పు- ఐదు అడుగుల లోతు గుంతలను తవ్వి.. శాస్త్రీయంగా వాననీరు ఇంకేలా చేస్తారు. ప్రతి ఉద్యానవనంలో నాలుగు వేల లీటర్ల వాననీటి సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. కొన్ని ఉద్యానవనాల్లో ఎండిపోయిన బోరుబావులను పునశ్చేతన పనులు చేపడుతున్నామని ఆమె వెల్లడించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూగర్భజల మట్టం విపరీతంగా పెరిగినట్లు గుర్తించారు.



నీటి సంరక్షణ పనుల్లో కార్మికులు నిమగ్నం

క్యాన్సర్ చికిత్సకు కొత్త యంత్రం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : భారతదేశంలో క్యాన్సర్ చికిత్సలకు ఇన్‌ట్రా- ఆపరేటివ్ ఎలక్ట్రాన్ రేడియేషన్ థెరపీని మొదటిసారి పరిచయం చేస్తున్నామని బెంగళూరులోని ఆస్టర్ ఆసుపత్రి ప్రకటించింది. రేడియేషన్‌తో ఎదురయ్యే దుష్పరిణామాన్ని గణనీయంగా తగ్గించేందుకు, క్యాన్సర్ కణితి ఉన్న చోటు మాత్రమే చికిత్స అందించవచ్చని ఆసుపత్రి ఉప నిర్వహణ విభాగం అలీషా ముప్పన్ తెలిపారు. వైద్య విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ బీఎల్ సుజాత రాథోడ్‌తో కలిసి చికిత్స పరికరాన్ని ఆమె గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ఎటువంటి క్యాన్సర్ అయినా ప్రారంభ దశలో గుర్తిస్తే కొద్ది రోజుల్లోనే నయం చేయొచ్చని చెప్పారు. ఈ తరహా చికిత్సలు అభివృద్ధి చెందిన కొన్ని దేశాల్లో మాత్రమే ఉన్నాయని వివరించారు. ఆసుపత్రి ప్రతినిధులు, వైద్యులు డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ ఎంఎస్ బెళ్లియప్ప, ఫ్రాన్సిస్కో ఝూనెట్టి, ఎస్ఐటీ సోర్డినా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



చికిత్స అందించే యంత్రం వద్ద సంస్థ ప్రతినిధులు

బెంగళూరు
•బెంగళూరు •హోసూరు

'విందులో ఎలాంటి ప్రత్యేకత లేదు'

మైసూరు, న్యూస్‌టుడే: మైసూరులో మంత్రి మహదేవప్ప నివాసంలో ఇద్దరు మంత్రులు, ఒక ఎమ్మెల్యే విందుకు హాజరయ్యారు. సతీశ్ జార్కిహొళి, పరమేశ్వర్, ఎమ్మెల్యే ఏఆర్ కృష్ణమూర్తి ప్రత్యేకంగా సమావేశం కావడంపై దళిత నాయకుడిని సీఎంగా ప్రకటించాలని పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తేవాలన్న డిమాండ్‌తోనే చర్చలు నడిచినట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో తమ విందులో ఎలాంటి ప్రత్యేకత లేదని, మైసూరులోనే తాము ఉండటంతో మంత్రి ఆహ్వానంతో భోజనానికి వెళ్లినట్లు మంత్రులు సతీశ్, పరమేశ్వర్ స్పష్టం చేశారు. హరియాణాలో కాంగ్రెస్ ఓటమికి, ముడా అక్రమాలకు ఎటువంటి సంబంధం లేదన్నారు. దళిత సీఎం, ముఖ్యమంత్రి మార్పు తదితరాలకు సంబంధించి తాను మాట్లాడనని పరమేశ్వర స్పష్టం చేశారు.

'ముఖ్యమంత్రిపై సొంత పార్టీ ఒత్తిడి'

తుమకూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు భాజపా, జేడీఎస్ నాయకుల నుంచి వచ్చే ఒత్తిళ్ల కన్నా వారి సొంత పార్టీ కాంగ్రెస్ నుంచే అధికంగా ఒత్తిడి ఉందని కేంద్ర రైల్వే సహాయక మంత్రి వి.సోమణ్ణ వ్యాఖ్యానించారు. ఆయన గురువారం నగరంలో ఎంపీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం, చాముండేశ్వరి మాత పూజల కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైసూరులో వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో భాజపానే అధికారంలోకి రానున్నట్లు జోస్యం చెప్పారు. హరియాణాలో మూడోసారి పగ్గాలు చేపట్టడంపై ఆనందం వ్యక్తం చేశారు.

హోసూరు కబుర్లు




హోసూరు: అర్ధనారీశ్వర ఆలయంలో పూజలు

వైభవోపేతంగా దుర్గాష్టమి

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు-కృష్ణగిరి జాతీయ మార్గంలో పేరండపల్లి గ్రామ శివారు దక్షిణ పినాకిని నదీతీరంలో వెలసిన శివశక్తిగారుల్లోని అర్ధనారీశ్వర ఆలయంలో నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఆలయంలో మహిళా భక్తులు చాముండి దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ యాగం చేశారు. 108 మంది సుమంగళులు పాల్గొని మహా మంగళహారతి ఇచ్చారు.



బేరికె: ప్రత్యంగిరామాతగా అమ్మవారు



హోసూరు: ప్రత్యేకాలంకారంలో మహాదుర్గ

బాగలూరు (బేరికె), న్యూస్‌టుడే: బాగలూరు తేరుపేటలోని దుర్గామాలమ్మేశ్వరి ఆలయంలో ధర్మకర్త మునిలక్ష్మి తిమ్మరాయప్ప ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సాగుతున్నాయి. అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఏడు రోజులుగా అమ్మవారిని జగన్మోహిని, సరస్వతి, మీనాక్షి, వారాహి, అన్నపూర్ణేశ్వరి, ప్రత్యంగిరామాత అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గురువారం అమ్మవారు దుర్గామాత, మహాశక్తిగా దర్శనం ఇచ్చారు. మహిళా భక్తులు దుర్గామాత స్తోత్రాలు పఠించారు. ఆలయ ట్రస్టు కార్యదర్శి శివా, కౌండిరి యలహంక రత్న, సభ్యులు విన్సెంట్, భాస్కర్, విజయకుమార్, మహాలక్ష్మి, మంగళ, శ్యామల, వెంకటరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



బాగలూరు: దుర్గాస్తోత్రం పారాయణం చేస్తున్న భక్తులు

రతన్‌టాటా సేవలు ఎనలేనివి

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు నగర పాలికె పరిధిలో గురువారం రతన్‌టాటా చిత్రపటానికి స్థానిక పారిశ్రామివేత్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి రతన్ టాటా అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. హోసూరు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఆయన ముఖ్య కారకుడని గుర్తు చేసుకున్నారు. హోసూరులో మహిళల జీవనోపాధికి చేతి గడియారాల పరిశ్రమ ప్రారంభించారన్నారు. కార్మికులకు మత్తిగెరిలో అన్ని వసతులతో టైటాన్ టౌన్‌షిప్ నిర్మించారని, నాగమంగలంలో అంతర్జాతీయ స్థాయిలో సెల్‌ఫోన్‌ల విడిభాగాల తయారీ పరిశ్రమను స్థాపించారని కొనియాడారు. ఆయన మరణం కృష్ణగిరి జిల్లావాసులకు తీరని లోటన్నారు. సిప్‌కాట్‌లో భాజపా జాతీయ కమిటీ సభ్యులు జి.బాలకృష్ణ ఆధ్వర్యంలో బాలాజీ, పరమగురు, శివకుమార్ తదితరులు నివాళులర్పించారు.



రతన్‌టాటా చిత్రపటానికి నివాళులు

ప్రభుత్వ పాఠశాలలో మంత్రి తనిఖీ

కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై(రి)లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం విద్యా మంత్రి అన్బిల్ మహేష్ సందర్శించారు. విద్యా బోధనతో పాటు విద్యార్థుల చేతిరాతను పరిశీలించారు. తమిళం, ఆంగ్లంలో వారి ప్రతిభను పరీక్షించారు. బడిలోని ఫిర్యాదుల పెట్టెలోని లేఖలపై ఆరా తీశారు. పాఠశాల అభివృద్ధిపై పోషక ఉపాధ్యాయ సంఘం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పిల్లలకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు.



\- న్యూస్‌టుడే, హోసూరు

తేలని చెన్నపట్టణ అభ్యర్థి ఎంపిక


రామనగర, న్యూస్‌టుడే: చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపే విషయంలో భాజపా, దళ్ మధ్య ఇప్పటివరకు ఎలాంటి ఒప్పందం ఖరారు కాలేదని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు. రామనగరలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళ్‌కు పట్టున్న ఈ నియోజకవర్గాన్ని ఇతరులకు వదిలి పెట్టవద్దని కార్యకర్తలు చేస్తున్న సూచనలను పరిగణనలోకి తీసుకుంటానని చెప్పారు. నిఖిల్‌ను బరిలో నిలపాలని ఎక్కువ మంది కార్యకర్తలు సూచించినట్లు ఆయన వెల్లడించారు.

'అందుకే కులాల నివేదిక అమలు ప్రతిపాదన'

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: మూడా, వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి సీఎం సిద్ధరామయ్య కులాల అధ్యయన నివేదిక అమలుకు ప్రతిపాదన చేస్తున్నారని విధానపరిషత్ సభ్యులు సీటీ రవి ఆరోపించారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంపై అవినీతి ముద్ర పడటంతో సీఎం కొత్త ఎత్తులు వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందన్నారు. పాకిస్థానీ పౌరులు బెంగళూరు, దావణగెరెలో హిందూవుల పేర్లతో నివాసాలు ఏర్పాటు చేసుకోవడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణమని మండిపడ్డారు. అవినీతి, కుంభకోణాల్లో ఇరుకున్న సిద్ధరామయ్య, మాజీ మంత్రి నాగేంద్రలను కాంగ్రెస్ అధిష్ఠానం వెనుకేసుకొని రావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయన వెంట విధాన పరిషత్ సభ్యులు కేఎస్ నవీన్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, జడ్పీ మాజీ అధ్యక్షురాలు సౌభాగ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, రైతు మోర్చా అధ్యక్షుడు మల్లికార్జున్ తదితరులున్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ సీటీ రవి




బెంగళూరు: విశేషాలంకారంలో బనశంకరి మాత



బెంగళూరు: అర్ధనారీశ్వరిగా శాకంబరిదేవి



గవిగంగాధర ఆలయంలో దుర్గాపరమేశ్వరి



బెంగళూరు: శాంతస్వరూపిణిగా అభయహస్త అంబాభవాని



కెంగేరి: శంకరమఠంలో సరస్వతిగా..

జయహో దుర్గాభవాని

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజు గురువారం వివిధ అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని దుర్గామాతగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. బనశంకరి ఆలయంలో అమ్మవారు వివిధ వర్ణరంజిత వస్త్రాలంకారంలో దర్శనం ఇవ్వగా, శాకంబరిదేవి అర్ధనారీశ్వర రూపంలో కనువిందు చేశారు. హనుమంతనగరంలోని శేష మహాగణపతి ఆలయంలో పార్వతీదేవిని, గవిగంగాధర గుడిలో దుర్గాపరమేశ్వరిగా భక్తులను ఆశీర్వదించారు.

బెంగళూరు (కెంగేరి): యశ్వంతపుర విధానసభ క్షేత్రం కెంగేరి ఉపనగరం అపూర్వ లేఅవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుడి మూలవిగ్రహాన్ని గోపాలకృష్ణుడిగా అలంకరించారు. శారదాంబ దేవాలయం, శంకరమఠంలో అమ్మవారు సరస్వతిగా కనిపించారు. ప్రతి ఇంటిలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మైసూరు దసరా ఉత్సవాల్లో నాట్య సన్నిధి భరతనాట్య కళాశాల, బెంగళూరు బృందం నాట్యం ప్రదర్శించి జ్ఞాపిక అందుకుంది.

బెంగళూరు (క్రీడలు): నగర విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ఆచార్య లింగరాజగాంధి ఆధ్వర్యంలో ఆయుధ పూజ జరిగింది. రిజిస్ట్రార్ టి.జవరేగౌడ, డాక్టర్ సీఎస్ ఆనందకుమార్, ఉప రిజిస్ట్రార్ కులకరణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కెంగేరి: ఆకట్టుకున్న బొమ్మలకొలువు




కెంగేరి: నృత్యంతో అలరించిన కళాకారులు

తుమకూరు దసరా వైభవం

తుమకూరు, న్యూస్‌టుడే: నగరంలో గురువారం, శుక్రవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో తొలిసారి దసరా ఉత్సవాలు చేపట్టారు. ఇప్పటికే హెచ్‌ఏఎల్ నుంచి హెలికాప్టర్, గుర్రాలు, ఏనుగులు సమకూర్చుకున్నారు. ఉదయం 7 గంటలకే మైసూరు కర్ణాటక పోలీస్ రిజర్వు అశ్వ బృందం ఆధ్వర్యంలో పది గుర్రాలపై ఎస్పీ అశోక్, అదనపు ఎస్పీలు మరియప్ప, అబ్దుల్ ఖాదర్, డీఎస్పీ చంద్రశేఖర్ తదితరులు పథ సంచలనం చేశారు. ఉత్సవాలను వైభవంగా జరపడానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. వర్షం రాకూడదని ప్రజలు దేవుడిని ప్రార్థిస్తున్నారు. జిల్లాధికారి కార్యాలయంలో పూజలు నిర్వహించారు. మరో వైపు జిల్లావ్యాప్తంగా పండగ నేపథ్యంలో పూలు, పండ్ల మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడాయి. పూలు, పండ్లు, బూడిద గుమ్మడికాయలు, అరటి పిలకల ధరలు అధికంగా పలికాయి. తుమకూరు నగరం విద్యుద్దీపాలతో తళుకులీనుతోంది.



అంతరసనహళ్లి మార్కెట్‌లో జోరుగా పూల అమ్మకాలు



గుర్రాలపై స్వారీ చేస్తున్న ఎస్పీ అశోక్, అదనపు ఎస్పీలు మరియప్ప, అబ్దుల్‌ఖాదర్ తదితరులు

సీఎం కప్ విజేత బెంగళూరు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : మైసూరు దసరా ఉత్సావాల్లో సీఎం కప్ కోసం చాముండీ విహార్ క్రీడాప్రాంగణంలో జరిగిన క్రీడోత్సవాల్లో బెంగళూరు సిటీ జట్టు 201 పాయింట్లతో ఓవర్‌ఆల్ ప్రశస్తి దక్కించుకొంది. ఆతిథ్య మైసూరు జట్టు 194 పాయింట్లతో రెండో స్థానం, బెళగావీ డివిజన్ జట్టు 131 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. పురుషుల విభాగం ఫుట్‌బాల్ పోటీల్లో మైసూరు జట్టు, హ్యాండ్‌బాల్‌లో బెంగళూరు గ్రామీణ జట్టు, హాకీలో బెంగళూరు సిటీ, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మైసూరు, ఖోఖో, త్రోబాల్‌లో బెంగళూరు సిటీ జట్టు విజయం సాధించాయి. వాలీబాల్‌లో స్థానిక మైసూరు, కత్తి పోటీలో బెంగళూరు సిటీ జట్టు అగ్రస్థానాన్ని చేపట్టాయి. మహిళల విభాగం హ్యాండ్‌బాల్, హాకీ, ఖోఖో, త్రోబాల్, బాస్కెట్‌బాల్ మైసూరు జట్టు తొలి స్థానంలో నిలిచి జ్ఞాపిక అందుకొంది. కబడ్డీలో బెళగావీ, నెట్‌బాల్, కత్తి పోటీలో బెంగళూరు సిటీ జట్టు తొలి స్థానం చేపట్టాయి.



ప్రశస్తి, జ్ఞాపిక అందుకున్న బెంగళూరు సిటీ క్రీడాకారులు

హోరాహోరీగా కుస్తీ పోటీలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : మైసూరు దసరా ఉత్సావాల సందర్భంగా దసరా నాడ (మట్టిలో జరిగే పోరు) కుస్తీ పోటీల్లో బాగలకోటెకు చెందిన పహిల్వాన్ శివయ్యపూజారి దసరా కంఠీరవ, ముధోళకు చెందిన సదాశివనలవడే దసరా కేసరి ప్రశస్తి, వెండిగద అందుకున్నారు. బుధవారం రాత్రి దొడ్డకెరె మైదానం డి.దేవరాజు అరస క్రీడాప్రాంగణంలో జరిగిన పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హెచ్.సి.మహాదేవప్ప విజేతలకు వెండి గదలతో పాటు రూ.15 వేల నగదు పురస్కారం అందజేశారు. శివయ్యపూజారి ప్రత్యర్థి పహిల్వాన్ బాపూసాహెబశిందేను మట్టికరిపించి దసరా కంఠీరవ ప్రశస్తి సొంతం చేసుకున్నాడు. ముధోళకు చెందిన సదాశివనలవడే ప్రత్యర్థి దావణగెరె జిల్లా పహిల్వాన్ బసవరాజపాటిల్‌పై గెలుపొంది దసరాకేసరి టైటిల్, రూ.12,500 నగదు పురస్కారం అందుకున్నాడు. మండ్యకు చెందిన గిరీష్ ప్రత్యర్థి మైసూరు కుస్తీ క్రీడాకారుడు ఆర్.నితిన్‌పై గెలుపొంది దసరా కుమార ప్రశస్తి, దావణగెరెకు చెందిన కొరవర సంజీవ మిత్రుడు పి.గౌడపై గెలుపొంది దసరా కిశోర ప్రశస్తి సాధించాడు. మహిళల విభాగంలో జరిగిన పోటీలో దావణగెరె క్రీడా వసతి పాఠశాల క్రీడాకారిణి ఎస్.శాలినిసిద్ధి ప్రత్యర్థి గాయత్రి గెలిచి దసరా కిశోరి టైటిల్ దక్కించుకొంది. ముగింపు వేడుకల్లో కుస్తీ ఉపసమితి విశేషాధికారి ఏఎస్పీ ఎల్.నాగేశ్, సమితి పదాధికారులు పాల్గొన్నారు.



వెండిగదతో విజేత

కులగణన వివరాల వెల్లడికి డిమాండ్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఆర్థిక, సామాజిక, విద్య రంగాలపై అధ్యయనం చేసిన కాంతరాజు కమిషన్ నివేదికను తక్షణం అమలు చేయాలంటూ గురువారం ఇక్కడ స్వతంత్ర ఉద్యానవనం వద్ద ఆర్‌పీఐ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జాతీయ కార్యాధ్యక్షుడు డాక్టర్ ఎం.వెంకటస్వామి మాట్లాడుతూ నివేదికను అమలు చేస్తేనే అన్ని వర్గాలకు సామాజికంగా, ఆర్థికంగా న్యాయం జరుగుతుందన్నారు. తక్షణం అందుకు సంబంధించిన కుల గణన వివరాలను వెల్లడించాలని కోరారు.

పిడుగుపాటుతో ఆరుగురికి అస్వస్థత

కార్వార, న్యూస్‌టుడే: సిద్ధాపుర తాలూకా హార్సికట్టా సమీప గాళిజడ్డి గ్రామంలో బుధవారం రాత్రి పిడుగుపాటుకు ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. పొలం నుంచి వారు ఇంటికి నడచుకుని వెళుతుండగా భారీ వర్షం కురిసింది. చెట్టు వద్దకు వెళ్లి నిలబడిన సమయంలో పక్కనున్న మరో చెట్టుపై పిడుగుపడడంతో అందరూ గాయపడి అస్వస్థతకు గురయ్యారు. బాధితులను చికిత్స నిమిత్తం సిద్ధాపుర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తహసీల్దారు మధుసూదన్ కులకర్ణి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఉత్తర కన్నడ జిల్లావ్యాప్తంగా గురువారమూ భారీ వర్షాలు కొనసాగాయి. ఆదివారం వరకు తీర ప్రాంత జిల్లాలు, బెంగళూరు, కోలారు, మైసూరు, శివమొగ్గ, రామనగర, తుమకూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

'ప్రధాని మోదీ మార్పుపై చర్చలు'

మైసూరు, న్యూస్‌టుడే: ప్రధాని స్థానం నుంచి మోదీని తొలగించాలని సంఘ్ పరివార్ నేతలు వరుస సమావేశాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి సంతోశ్ లాడ్ వ్యాఖ్యానించారు. ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ సంఘ్ పరివార్ మాటలను మోదీ లెక్కచేయడం లేదని, అందుకే ఆయనను తొలగించాలని చర్చించుకుంటున్నట్లు తెలిపారు. ఇదే విషయాన్ని భాజపా నాయకులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.

ఆత్మహత్య బెదిరింపుపై ఫిర్యాదు

కార్వార, న్యూస్‌టుడే: మద్యం తాగి వచ్చిన వ్యాన్ డ్రైవరు డీఎం గైక్వాడను ఎక్సైజ్ శాఖాధికారి శివప్ప మందలించారు. మరోసారి మద్యం తాగి వస్తే విధుల నుంచి తొలగిస్తానని హెచ్చరించారు. దీంతో గైక్వాడ్ తనను మందలిస్తే మీరు వేధిస్తున్నారని లేఖ రాసి పెట్టి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. వెంటనే ఆయనపై శివప్ప శిరసి ఠాణాలో ఫిర్యాదు చేశారు.

సెలూన్ శాఖ ప్రారంభం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: నగరంలోని ఓ మాల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన అత్యాధునిక సేవల సెలూన్ శాఖను నటి మలైకా అరోరా ప్రారంభించారు. ఆమె ఆ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూపదర్శుల ఎంపికకు నిర్వహించిన పోటీల్లో మిస్ ఫేస్ ఆఫ్ బెంగళూరుగా నేహారై కిరీటం దక్కించుకున్నట్లు చెప్పారు.

క్రైం కార్నర్

యూట్యూబర్ అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : స్వచ్ఛత పేరుతో బేకరి యజమానులను బెదిరిస్తూ వారి నుంచి బలవంతంగా నగదు వసూలు చేస్తున్నాడనే ఆరోపణపై యూట్యూబర్ షఫీ హులిమావును పోలీసులు అరెస్టు చేశారు. బొమ్మసంద్ర నివాసి అయిన నిందితుడు స్వచ్ఛతను పాటించడం లేదని బేకరి లోపలకు వెళ్లి వీడియో చిత్రీకరించి లైసెన్సు రద్దు చేయిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఓ బేకరి యజమానిని బెదిరించి అతడి నుంచి రూ.10 వేలు వసూలు చేసే సమయంలో పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు.

నకిలీ పత్రాల కేసులో ఐదుగురి...

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నకిలీ భూ దాఖలాలను సృష్టించి వాటిని బీడీఏకు అందించి పరిహారం కింద రూ.70కోట్లు పొంది, సంస్థను మోసగించారనే ఆరోపణపై చల్లఘట్ట నివాసులు శ్రీనివాస్, నాగరాజు, రవికుమార్, భరత్, స్వామిలను శేషాద్రిపురం పోలీసులు అరెస్టు చేశారు. వారితో కుమ్మక్కైన బీడీఏ, రెవెన్యూ అధికారులపై కేసులు నమోదు చేశారు. చల్లఘట్ట సర్వేనెం : 13,58కు చెందిన ఆరు ఎకరాల భూమికి నకిలీ పత్రాలు సృష్టించారు. ఆ భూమిని బీడీఏ స్వాధీనం చేసుకుంది. భూమి యజమానులు తామేనని చెప్పి నకిలీ పత్రాలను బీడీఏకు అందించి పరిహారం పొందారు. ఈ వ్యవహారంలో బీడీఏ, రెవెన్యూశాఖ అధికారులు కుమ్మక్కైనట్లు గుర్తించారు.

చోరీ కేసులో తండ్రీ కొడుకుల...

బెంగళూరు(యలహంక), న్యూస్‌టుడే : వివిధ ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్‌ల్లో సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్నారనే ఆరోపణపై మహ్మద్ ఫయాజ్‌తో పాటు 15 ఏళ్ల అతడి కుమారుడిని హుళిమావు పోలీసులు ప్రశ్నిస్తున్నారు. వారిద్దరూ దొంగలించిన 22 సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో దోపిడీదొంగలు

దావణగెరె, న్యూస్‌టుడే: చెన్నగిరికి చెందిన వక్క వ్యాపారి అశోక్‌ను జోళదాళ వద్ద దోచుకుని పరారైన ఏడుగురు దోపిడీదొంగలను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నగిరి, సంతెబెన్నూరు ఠాణా పోలీసులు సంయుక్తంగా కార్యాచరణ నిర్వహించి మహ్మద్ ఇనాయత్, ఉమర్ ఫారూక్, షాహిద్ ఖాజి, ఖురంఖాన్, సయ్యద్ సైఫుల్లా, ఖాషిఫ్ అహ్మద్, ఖురంఖాన్‌ను అరెస్టు చేశారు. నిందితులు రూ.17.24 లక్షలు దోచుకోగా రూ.7.37 లక్షల నగదు, రెండు కార్లు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. పరారీలోని ఇతర నిందితుల కోసం గాలింపు తీవ్రం చేశారు.

బ్యాంకులో చోరీ యత్నం

కలబురగి, న్యూస్‌టుడే: చించోళి తాలూకా సులేపేట ఠాణా పరిధిలోని బ్యాంకులో చోరీకి విఫల యత్నం చేసిన కర్చేఖేడ గ్రామానికి చెందిన తుక్కప్ప కంచేర అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. బ్యాంకు ఆవరణలోని సీసీ కెమెరా ఫుటేజీని సిబ్బంది సులేపేట పోలీసులకు అప్పగించారు. వారు కార్యాచరణ నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సులేపేట ఠాణా పోలీసులు నిందితుడి నుంచి గునపం, స్క్రూడ్రైవర్, తాడు, బాకు, వ్యానిటీ బ్యాగ్, ఒక బైకు జప్తు చేసుకున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

శివమొగ్గ, న్యూస్‌టుడే: యడవాళ, హిట్టూరు మధ్య కట్ట తెగి ప్రవహిస్తున్న చెరువులో చిన్నికట్టె నివాసి ఇక్బాల్ (40) బుధవారం రాత్రి కొట్టుకుపోయారు. ఆయన మృతదేహాన్ని గురువారం ఉదయం గుర్తించారు. లోక్‌సభ సభ్యుడు బీవై రాఘవేంద్ర మృతుడి కుటుంబ సభ్యులను కలుసుకొని పరామర్శించారు. జిల్లాలోని చెరువుల కట్టలను బలోపేతం చేయడంతో పాటు రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆయన ప్రజాపనుల శాఖ ఇంజినీర్లు, అధికారులను ఆదేశించారు.

ఘనంగా విశ్వ దృష్టి దినోత్సవం

పావగడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వైద్యాధికారి డాక్టర్ ఏఎస్ఎల్ బాబు ఆధ్వర్యంలో విశ్వ దృష్టి దినోత్సవాన్ని ఘనంగా ఆచరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి నేత్రాలు ప్రధానమైన అవయవాలని, వాటిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. హాజరైన ప్రజలకు కంటిపై అవగాహన కల్పించారు. తాలూకా వైద్యుడు కిరణ్‌కుమార్, నేత్ర విభాగం ఉద్యోగి పవిత్ర, ఎన్‌సీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పావగడ



దుర్గోత్సవం చేయరా?

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: చిత్రదుర్గం జిల్లా చరిత్ర, సంస్కృతిని బయటి ప్రపంచానికి చెప్పడానికి డిసెంబరు నెల లోపు ప్రభుత్వం దుర్గోత్సవం-2024 నిర్వహించాలని కరునాడ విజయసేన జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మైసూరు దసరా, హంపీ, కిత్తూరు, కొడగు తదితర ఉత్సవాల తరహాలోనే చిత్రదుర్గం ఉత్సవం నిర్వహించాలని కోరారు. దశాబ్దం క్రితం హెచ్.ఆంజనేయ జిల్లా బాధ్య మంత్రిగా ఉన్నప్పుడు దుర్గోత్సవాలు జరిపారని గుర్తుచేశారు.

ఐఏఎస్ అధికారుల బదిలీ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: వివిధ శాఖల్లో సేవలందిస్తున్న ముగ్గురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులు, వారికి కేటాయించిన శాఖలు ఇలా ఉన్నాయి. మహ్మద్ మొహిసిన్ (ప్రధాన కార్యదర్శి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ), డాక్టర్ ఎన్‌వీ ప్రసాద్ (కార్యదర్శి, కార్మిక శాఖ), ఎన్ మంజుశ్రీ (కమిషనర్, పాఠశాల విద్యా శాఖ).


మల్లన్న స్వామి

13న ఖానాపూరులో మల్లన్న రథోత్సవం

బీదర్ (రాయచూరు), న్యూస్‌టుడే : విజయదశమి సందర్భంగా బీదర్ జిల్లా బాల్కి తాలూకా ఖానాపూర్‌లో ఈ నెల 13న మల్లన్న రథోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన సమితి అధ్యక్షుడు ప్రకాష్ మేత్రే, కార్య నిర్వాహణాధికారి అనంతరావ్ కులకర్ణి ఒక ప్రకటనలో తెలిపారు. 12న రాత్రి 11.15 గంటలకు మల్లన్న దేవాలయం వద్ద పల్లకీసేవ మొదలై ప్రముఖ వీధుల మీదుగా హనుమాన్ మందిరానికి చేరుకుంటుందన్నారు. 13న ఉదయం మల్లన్నకు అభిషేకం, పూజలు, ధార్మిక కార్యక్రమాలు, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు

బంగారు భార్గవ్

బెంగళూరు ఎంఎస్ రామయ్య ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ (స్ట్రక్చర్) విభాగంలో కందవార చంద్రశేఖర్ భార్గవ్ బంగారు పతకాన్ని అందుకున్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన 16వ స్నాతకోత్సవంలో రక్షణశాఖ విజ్ఞాన సంపాదకుడు ఆచార్య అత్రే, కళాశాల ఛైర్మన్ ఎంఆర్ జయరాం భార్గవ్‌కు పతకం ప్రదానం చేశారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో భార్గవ్ టాపర్‌గా నిలిచారు. - న్యూస్‌టుడే, సదాశివనగర



అలంకారం.. కమనీయం


భ్రమరాంభ దేవాలయం ఆవరణలో హోమం

రాయచూరు, న్యూస్‌టుడే : దుర్గాష్టమి సందర్భంగా గురువారం జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో వేద మంత్రోచ్ఛరణలతో పూజలు, హోమాలు నిర్వహించారు. పార్వతీ దేవి అష్టోత్తరం పారాయణం చేశారు. దసరా నవరాత్రి ఉత్సవాలు చివరి అంకానికి సమీపించడంతో దేవస్థానాలు కిటకిటలాడాయి. ఉత్సవాల్లో ఎనిమిదో రోజు దుర్గామాత దర్శనానికి పెద్ద ఎత్తున భక్త జనం తరలి వచ్చారు. మహిళలే అధికంగా కన్పించారు. శత్రుసంహారిణి, కరుణామయిని విశేషంగా ఆలంకరించారు. నిజలింగప్ప కాలనీ మిలీనియం ఉద్యానవనంలోని భ్రమరాంభదేవికి దుర్గామాత అలంకరణ కనువిందు చేసింది. లోక కల్యాణం కోసం ఆలయం ఆవరణలో శాస్త్రోక్తంగా హోమం చేశారు. కౌన్సిలర్ శరణప్ప, ప్రముఖులు సంకురాత్రి వెంకటేశ్వరరావు, సూర్యదేవర నాగేశ్వరరావు, శంకరరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. బోళమానదొడ్డి రహదారి బిల్వ మందిరంలో వెలసిన దుర్గా పరమేశ్వరికి చండి, గణ హోమం, కలశారోహణ చేశారు. ఉత్సవమూర్తికి పల్లకీసేవ జరిపారు. కిల్లే బృహన్మఠం స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు, సంగయ్య స్వామిశాస్త్రి సమక్షంలో పూజలు నిర్వహించారు. మున్సిపల్ అధ్యక్షురాలు నరసమ్మ, కౌన్సిలర్ ఎస్.కె.నాగరాజ్, శ్రీకృష్ణ దేవరాయ కాలనీ, మధురానగర్, ఆశీర్వాద కాలనీ, సుచిత్రా కాలనీ, నిసర్గ కాలనీ, న్యూ ఎన్‌జీవో కాలనీ నివాసులు పాల్గొన్నారు. గూడ్స్‌షెడ్ ప్రాంతంలోని ముత్యాలమ్మదేవికి పూలు, తమలపాకులతో అలంకరించారు. మున్నూరు కాపు సామాజిక వర్గం నేతృత్వంలో గద్వాల్ రహదారిలోని మాతా మహాలక్ష్మి, కాళికాదేవి ఆలయాల్లో దేవి నవరాత్రులు శోభాయమానంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన మహిషాసురమర్దిని నాటకానికి ప్రేక్షకులు చప్పట్ల వర్షం కురిపించారు. ఉప్పారవాడి లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఏడు కొండలస్వామి దేవదేవుడు గజ వాహనంపై వీధుల్లో ఊరేగారు. ఆదినారాయణ భజన మండలి సభ్యులు శ్రీనివాసుడి కీర్తనలు ఆలపించారు.


దుర్గామాతగా భ్రమరాంబ


రక్తి కట్టించిన మహిషాసురమర్దిని నాటకం

దుర్గాదేవి ఆలయాల కళకళ

సింధనూరు, న్యూస్‌టుడే : దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తాలూకాలోని తెలుగువారి క్యాంపుల్లో దుర్గాదేవి ఆలయాలు భక్తులతో, ప్రత్యేక పూజలతో కళకళలాడుతూ.. రోజంతా భజనలు, కీర్తనలతో ఓలలాడిస్తున్నాయి. విజయదశమి దగ్గర పడుతున్నకొద్దీ ఆలయాలకు తరలి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. గురువారం గాంధీనగర్‌లో అమ్మవారిని శాకాంబరి అలంకరించి భక్తులకు దర్శనం కలిగించారు. వెంకటేశ్వర పైక్యాంపులో శ్రీవాసవీ సహిత హరిహరాత్మజ క్షేత్రంలో వాసవీ అమ్మవారికి భక్తులతో అభిషేకం చేయించిన అర్చకులు ఆపై అలంకారం చేశారు. వెంకటగిరిక్యాంపులోని శ్రీసిద్ధేశ్వర ఆశ్రమంలో అమ్మవారిని కాళికాదేవిగా అలంకరించారు. బప్పూరు మార్గంలోని దేవిక్యాంపు, ఈజే.హోసళ్లిక్యాంపు, శాంతినగర్, బూదిహాళక్యాంపు, పగడదిన్నిక్యాంపు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి పూజలు చేశారు.


గాంధీనగర్‌లో శాకాంబరి దేవి


వెంకటగిరి క్యాంపులో కాళికాదేవిగా

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి పూజలు


దుర్గా అలంకరణలో అమ్మవారు


రామనాథ్‌క్యాంపులో దుర్గాదేవి

మాన్వి, న్యూస్‌టుడే : సిరివార, మాన్వి తాలూకాల్లోని వివిధ క్యాంపుల్లో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం దాదాపు అన్ని ప్రాంతాల్లో అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ చేశారు. దేవాలయాల్లో ఉదయం, రాత్రి వేళల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సత్కార్య సేవా సమితి నిర్వాహకులు జి.రఘురామ్‌శర్మ, జీవీవీ సత్యనారాయణశర్మ, కృష్ణమాచార్య, ప్రసాద్, సాయి ప్రసాద్, రజనీ శర్మ అర్చకుల సాన్నిధ్యంలో శరన్నవరాత్రి నిత్యపూజలు జరుగుతున్నాయి. ఆలయాలు మహిళా భక్తులతో సందడిగా మారాయి. దేవస్థాన సేవా సమితుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్నారు.

✦ పట్టణంలోని వాసవీ కల్యాణ మంటపంలో ఆర్యవైశ్య సముదాయం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి హోమ పూజలు చేశారు. గురువారం అమ్మవారికి మహాగౌరిగా అలంకరించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సముదాయ ప్రజలు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు.


మహాగౌరి అవతారం

12న సింధనూరుకు విజయజ్యోతి యాత్ర

రాయచూరు, న్యూస్‌టుడే : కిత్తూరు ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విజయజ్యోతి యాత్ర ఈ నెల 12, 13 తేదీల్లో జిల్లాలో సంచరిస్తుందని జిల్లా పాలనాధికారి నితీష్ ఒక ప్రకటనలో వెల్లడించారు. 12న ఉదయం సింధనూరులోకి ప్రవేశించే యాత్రకు తహసీల్దార్ స్వాగతం పలుకుతారు. పూజలు చేసి వీడ్కోలు పలుకుతారు. మాన్వి మార్గంలో రాయచూరుకు చేరుకునే యాత్రను ఇక్కడి అధికారులు సాదరంగా ఆహ్వానిస్తారని తెలిపారు. అనంతరం దేవసూగూరు గ్రామం మీదుగా యాదగిరి జిల్లా వైపు వెళ్తుందని వివరించారు.




కార్యాలయాల్లో పూజ చేయించుకుంటున్న మంత్రులు సంతోశ్ లాడ్, పరమేశ్వర్

శక్తిసౌధకు పండగ కళ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: విధాన, వికాససౌధల్లోని మంత్రుల కార్యాలయాలకు పండగ కళ వచ్చింది. కొందరు మంత్రులు స్వయంగా ఆయుధ పూజ నిర్వహించుకోగా, మరి కొన్ని కార్యాలయాల్లో వ్యక్తిగత సిబ్బంది పూజలు చేశారు. సంతోశ్ లాడ్, డాక్టర్ పరమేశ్వర్‌లు కార్యాలయాలను శుభ్రం చేయించి అర్చకులను పిలిపించుకుని పూజలు చేసుకున్నారు. పూజల అనంతరం దిష్టి తీసి బూడిద గుమ్మడికాయల్ని కొట్టారు. అధికారులు, మంత్రులు తమ కార్లకు పూజ చేయించుకుని, విధానసౌధలోనే వాటిని వదిలి సొంత వాహనాల్లో ఇళ్లకు తిరిగి వెళ్లారు. పోలీసు కమిషనర్ కార్యాలయం, పోలీసు ఠాణాల్లో శుక్రవారం ఆయుధాల పూజకు గురువారమే ఏర్పాట్లు చేసుకున్నారు. నేటి నుంచి మూడు రోజులు సెలవు ఉండడంతో గురువారం మధ్యాహ్నానికే ప్రభుత్వ కార్యాలయాలలో పూజలు పూర్తి చేశారు.

క్యాన్సర్ చికిత్సకు కొత్త యంత్రం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : భారతదేశంలో క్యాన్సర్ చికిత్సలకు ఇన్‌ట్రా-ఆపరేటివ్ ఎలక్ట్రాన్ రేడియేషన్ థెరపీని మొదటిసారి పరిచయం చేస్తున్నామని బెంగళూరులోని ఆస్టర్ ఆసుపత్రి ప్రకటించింది. రేడియేషన్‌తో ఎదురయ్యే దుష్పరిణామాన్ని గణనీయంగా తగ్గించేందుకు, క్యాన్సర్ కణితి ఉన్న చోటు మాత్రమే చికిత్స అందించవచ్చని ఆసుపత్రి ఉప నిర్వహణ విభాగం అలిషా ముప్పన్ తెలిపారు. వైద్య విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ బీఎల్ సుజాత రాథోడ్‌తో కలిసి చికిత్స పరికరాన్ని ఆమె గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ఎలాంటి క్యాన్సర్ అయినా ప్రారంభ దశలో గుర్తిస్తే కొద్ది రోజుల్లోనే నయం చేయొచ్చని చెప్పారు. ఈ తరహా చికిత్సలు అభివృద్ధి చెందిన కొన్ని దేశాల్లో మాత్రమే ఉన్నాయని వివరించారు. ఆసుపత్రి ప్రతినిధులు, వైద్యులు డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ ఎంఎస్ బెళ్లియప్ప, ఫ్రాన్సిస్కో ఝూనెట్టి, ఎస్ఐటీ సోర్డినా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



చికిత్స అందించే యంత్రం వద్ద సంస్థ ప్రతినిధులు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

సింధనూరు, న్యూస్‌టుడే : ఎటువంటి ఒడుదుడుకులు ఎదురైనా కుంగిపోరాదు.. ధైర్యంగా ఎదుర్కోవాలి, జీవితంలో గెలుపోటములను సమానంగానే స్వీకరించాలని సింధనూరు సీనియర్ సివిల్ న్యాయమూర్తి రూప విద్యార్థులకు హితవు పలికారు. స్థానిక పీడబ్ల్యూడీ క్యాంపులోని సన్‌రైజ్ ఫార్మసీ కళాశాలలో గురువారం విశ్వ మానసిక ఆరోగ్య దినం ఆచరించారు. అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి రూప మాట్లాడుతూ మనిషి జీవితాన్ని గులాబీ పూవుతో పోల్చారు. జీవితం అందంగానే కనిపించినా.. కష్టాలనే ముళ్లు గుచ్చుకుంటూ ఉంటాయని అన్నారు. విద్యార్థులు తలెత్తుకుని బతికే జీవితం కావాలంటే పుస్తకాల వద్ద తలలు దించి చదవాలి, అతిగా చరవాణుల జోలికి వెళ్లకుండని సూచించారు. మరో సివిల్ న్యాయమూర్తి అచ్చప్ప దొడ్డబసవరాజ్, కళాశాల అధ్యక్షుడు ఇర్ఫాన్, ప్రాచార్యుడు లాజర్ సిరిల్ తదితరులు పాల్గొన్నారు.


న్యాయమూర్తి రూపను సత్కరిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

అందుబాటులో మానసిక చికిత్స


అవగాహన జాతాలో వైద్యులు, విద్యార్థులు

రాయచూరు, న్యూస్‌టుడే : శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం అంతే ప్రధానమని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సురేంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో నగరంలో గురువారం అవగాహన జాతా జరిగింది. జిల్లా పాలనాధికారి కార్యాలయం ఆవరణలో సురేంద్ర బాబు జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసం ఉంటే ఏ పనైనా సమర్థవంతంగా చేయవచ్చన్నారు. మానసిక, లేక దీనికి సంబంధించిన రోగాలకు ఆధునిక చికిత్స అందుబాటులో ఉందన్నారు. కౌన్సెలింగ్‌తో మానసిక సమస్యలను నయం చేయవచ్చునన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరముందని తెలిపారు. ఈ దిశగా నడిచేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తాలూకా ఆసుపత్రుల వైద్యులు, సిబ్బందిని సన్నద్ధం చేస్తామని తెలిపారు. ఈ ఏడాది 'పనుల్లో మానసిక ఆరోగ్యం' అనే నినాదందో ముందుకెళ్తామని వివరించారు. మానసిక వైద్య నిపుణుడు మనోహర్ పత్తార్, మానసిక ఆరోగ్య కార్యక్రమాల అమలు అధికారి డాక్టర్ యశోదా, వైద్యాధికారులు షాకీర్, ప్రజ్వల్, ప్రముఖులు దండప్ప బిరాదార్, లక్ష్మి, సరోజా, నాగరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా శౌచాలయం కూల్చివేతపై నిరసన

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని 20వ వార్డు ఆదాపూరుపేటలోని సామూహిక మహిళా శౌచాలయాన్ని కూల్చివేయటంపై వార్డుకు చెందిన మహిళలు ఆందోళన చేశారు. గురువారం మహిళలు స్థానిక పురపాలక సంఘం కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. మహిళా శౌచాలయాన్ని యంత్రాలతో కూల్చివేయటం దారుణమన్నారు. విషయం తెలిసి కూడా సంఘం ముఖ్యాధికారి మౌనం దాల్చారని నిందించారు. కూల్చివేసిన శౌచాలయాన్ని తిరిగి పునర్మించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో 20వ వార్డు సభ్యుడు వెంకటేశ్‌నాయక్, వార్డు మహిళలు రాఘమ్మ, నరసమ్మ, లక్ష్మీ, ఉరుకుందమ్మ, హుసేనమ్మ, బస్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ.. కిటకిటలాడిన విపణి


జనంతో రద్దీగా కనిపిస్తున్న మార్కెట్

రాయచూరు, న్యూస్‌టుడే : కన్నడిగులకు దసరా పెద్ద పండగ. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులున్నా ఘనంగానే జరుపుకుంటారు. తెల్లారితే ఆయుధ పూజ. ఆ మరుసటి రోజు విజయదశమి. దీంతో గురువారం ఉదయం, సాయంత్రం రాయచూరు విపణి ప్రాంతం కొనుగోలుదారులతో కిటకిటలాడింది. కూరగాయలు, పూలహారాలు, వివిధ రకాల పూలు, గుమ్మడికాయలు, మామిడి ఆకులు, అరటి పిలకలు, పూజా సామాగ్రి కోసం వచ్చిన వారితో విపరీతమైన రద్దీ ఏర్పడింది. పాత యూనియన్ బ్యాంక్ (భంగికుంట) రహదారి చివరి వరకు ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయటానికి స్థలం లేక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోయినా ఖరీదు చేయటానికి వెనుకంజ వేయలేదు. పూలకు డిమాండ్ ఉండటంతో పూల రైతులు వాహనాల్లో చెండుపూలను తెచ్చి కిలో వందకు విక్రయించారు. మార్కెట్ ధరతో పోలిస్తే తక్కువగా ఉన్నందున కొనుగోలుకు ఎగబడ్డారు. వస్త్ర దుకాణాలు సందడిగా మారాయి. గృహోపకరణ వస్తువులు, టీవీలు, చరవాణుల విక్రయాలను వ్యాపారులు రాయితీలు ప్రకటించారు. పండగకు సొంతూరికి వెళ్లే వారితో బస్టాండ్, రైల్వే స్టేషన్ కిక్కిరిసిపోయాయి. దక్షిణ మధ్య రైల్వే శాఖ అదనంగా రైళ్లను నడపటం ప్రయాణికులకు ఊరట ఇచ్చింది.


అరటి పిలకలు కొంటున్న మహిళలు

ఆయుధ పూజకు పూల తోరణాలు


మల్లేశ్వరం మార్కెట్‌లో విక్రయానికి పూల హారాలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ఆయుధపూజ, దసరా పండగ కొనుగోళ్లతో బెంగళూరు విపణి వీధులు కళకళలాడాయి. సిటీ మార్కెట్, మల్లేశ్వరం, యశ్వంతపుర, బసవనగుడి, కేఆర్‌పురం విపణులకు వచ్చిన పూలు, పండ్లు, తోరణం ఆకులు, అరటిబోదెలు, బూడిద గుమ్మడికాయల కొనుగోళ్లు జోరుగా సాగాయి. పీణ్య, కామాక్షిపాళ్య, కనకపుర రోడ్డు, బొమ్మనహళ్లి, దొమ్మసంద్ర, మాకళి తదితర ప్రాంతాల్లోని పారిశ్రామికవాడల్లో శుక్రవారం ఆయుధ పూజకు యంత్రాలను గురువారమే శుభ్రం చేశారు. యంత్రాలకు పూల హారాలతో అలంకరణలు చేశారు. విద్యాసంస్థలు, కార్యాలయాలకు సెలవు ఉండడంతో బెంగళూరుకు సమీపంలోని జిల్లాలకు ఎక్కువ మంది తరలి వెళ్లారు. వాహనాలకు పూజలు చేసుకునేందుకు వాటిని సర్వీస్ స్టేషన్లకు వాహనదారులు తరలి వచ్చారు. ధరలకు వెనకడుగు వేయకుండా నగరవాసి పండగకు కావలసిన నిత్యావసరాలు, మిఠాయిలు, పూలు, తదితరాలను కొనుగోలు చేసుకున్నాడు. ఇళ్ల ముందు కట్టుకునేందుకు, పరిశ్రమల్లో దిష్టి కాయల కోసం బూడిద గుమ్మడి కాయల కొనుగోలుకు ఎక్కువ మంది ముందుకు వచ్చారు. నగరంలోని అన్ని దుకాణాల వద్ద పండగ వాతావరణం కనిపించింది.


ఆసియా ఖండంలోనే అతి పెద్ద బెంగళూరు పూల విపణి కళకళ

'ఉప కాలువలకు నీరు విడుదల చేయాలి'

మాన్వి, న్యూస్‌టుడే : తుంగభద్ర ఎడమ కాలువ పరిధిలోని ఉపకాలువలకు నీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు గురువారం సిరివార పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం గౌరవాధ్యక్షుడు చామరస్ మాలీపాటిల్ మాట్లాడుతూ తాలూకాలో నీటిపారుదల, మెట్ట సేద్యం చేస్తున్న రైతులకు నీరు సరిగా అందక పంటలు ఎండిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు పోరాటం చేసినా, అధికారులకు వినతి పత్రాలు అందించినా ఫలితం లేదన్నారు. అప్పులు చేసి పంటలను సాగుచేసుకుంటున్నారని, రుణబాధలు భరించలేక ఆత్మహత్యలు జరిగిన సంఘటనలు తాలూకాల్లో జరిగినట్లు విచారం వ్యక్తం చేశారు. నీటి పారుదలశాఖ అధికారులు పూర్తిగా విఫలం చెందారని నిందించారు. రైతుల పొలాలకు నీరు చేరే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు. తహసీల్దార్ రవి రైతుల వద్దకు వచ్చి చర్చించారు. నీటి విషయంలో జరుగుతున్న తారతమ్యాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామని బరోసా ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. ఆల్దాళ, అమరావతి, గవిగట్టు, జానేకల్ తదితర గ్రామాలకు చెందిన రైతులు, రైతు సంఘం సభ్యులు, కార్యకర్తలు రాస్తారోకోలో పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించిన రైతులు

కళ తప్పిన కృష్ణవేణి

రాయచూరు, న్యూస్‌టుడే : రెండున్నర మాసాల క్రితం తీర ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన కృష్ణమ్మ జోరు నెమ్మదించింది. నదీమతల్లి రెండు లక్షలకు పైగా క్యూసెక్కుల ఉధృతితో హడలెత్తించిగా.. ప్రస్తుతం వేల క్యూసెక్కులకే పరిమితమైంది. కొన్ని రోజులుగా బండ రాళ్లు, ఇసుక గడ్డలు కన్పిస్తున్నందున జలవేణి కళ తప్పింది. నారాయణపుర జలాశయం నుంచి జూరాలకు గురువారం 11.800 క్యూసెక్కుల నీరు వదిలారు. ఆలమట్టి నుంచి నారాయణపురకు 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఈ ఆనకట్ట సామర్థ్యం 33.313 టీఎంసీలు కాగా.. తాజాగా 33.26 టీఎంసీల నీటి మట్టం నమోదైంది. డ్యామ్‌లో గరిష్ఠ స్థాయి నీరు ఉన్నందున రబీ పంటకు నీరు వదలాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. నదిలో నీటి లోతు లేకపోవడంతో కృష్ణమ్మ చెంతనే పూజలు చేయిస్తున్నారు. కృష్ణా పాత వంతెనకు దగ్గర్లో నిర్మిస్తున్న కొత్త వంతెన పనులు ఊపందుకున్నాయి. ప్రవాహం వల్ల జులై, ఆగస్టు, సెప్టెంబరులో పనులు మందగించిన విషయం తెలిసిందే. దరిమలా వంతెన నిర్మాణం సకాలంలో పూర్తి అవుతుందన్న ఆశాభావం ప్రజల్లో వ్యక్తమవుతోంది. రాయచూరు జిల్లాలో వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. తుంగభద్ర పరివాహక ప్రాంతంలో వాన పడుతోంది. ఈ జలాశయం నుంచి నదికి 5 వేల నుంచి 25 వేల క్యూసెక్కులకు పెంచే అవకాశమున్నందున తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.


దేవసూగూరు సమీపంలో ప్రవహిస్తున్న కృష్ణానది

అపురూపం.. రతన్ బంధం


బెంగళూరులో రతన్‌టాటాతో సుధామూర్తి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : వ్యాపార దిగ్గజం రతన్ టాటా మరణవార్తతో కన్నడనాడు దిగ్భ్రాంతికి గురైంది. ఆయన మరణ వార్త జీర్ణించుకోలేనిదని పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. రాష్ట్రంలోని పలువురు ప్రముఖులతో ఆయనకు అవినాభావ సంబంధం ఉంది. హుబ్బళ్లి బీవీబి కళాశాలలో 2013 జనవరి 30న దేశ్‌పాండే ఫౌండేషన్ 'టిప్పింగ్ పాయింట్' పేరిట నిర్వహించి సమావేశంలో రతన్ టాటా పాల్గొనడం ప్రస్తావనార్హం. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తితో కలిసి చర్చాగోష్ఠిలో మాట్లాడారు. హుబ్బళ్లి సమీపంలోని రాయపురలో ఇస్కాన్ వంటశాలకు వెళ్లి అక్కడ వంటకాల తయారీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉడుపికి కృష్ణ మఠాన్ని పదేళ్ల కిందట ఆయన సందర్శించారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని ఐటీ పార్కులో తన సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు రెండు దశాబ్దాల కిందట పర్యటించినప్పుడు ఇక్కడి ఐటీ రంగ ప్రముఖులతో సుదీర్ఘంగా ముచ్చటించడం ప్రస్తావనార్హం. బెంగళూరులో ఎయిర్‌షోలో యుద్ధ విమానాన్ని ఆయన ఓసారి నడిపి సంచలనంగా మారారు. టాటా మృతికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు పలువురు మంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల నాయకులు, హ్యాట్రిక్ స్టార్ శివరాజ్ కుమార్, కాంతార ఫేం రిషబ్ శెట్టి, నటదర్శకుడు ఉపేంద్ర, నిర్మాత అశ్విని పునీత్‌రాజ్‌కుమార్ తదితరులు సంతాపాన్ని ప్రకటించారు.


ఇస్కాన్ వంటగదిని పరిశీలిస్తున్న రతన్ టాటా

మఠంలో విజయేంద్ర పూజలు

బెళగావి, న్యూస్‌టుడే : మహానవమి, విజయదశమి పండగలను పురస్కరించుకుని హుక్కేరి హిరేమఠంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు, హోమం, పూజల్లో భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర గురువారం పాల్గొన్నారు. 'ఈ పండగ అనంతరం కర్ణాటకలో ప్రతి ఒక్కరి నివాసం సిరి సంపదలతో తులతూగాలి' అని తాను కోరుకుంటున్నానని ఆయన చెప్పారు. చండికాయాగంలో హవిస్సులు వేశారు. మఠాధిపతి చంద్రశేఖర శివాచార్య మహాస్వామి నుంచి ఆశీస్సులు అందుకుని, పార్టీ నాయకులతో కలిసి ఆయనను సత్కరించారు. పార్టీ నాయకులు అనిల్ బెనక, దుర్యోధన ఐహోళ, నిఖిల్ కత్తి, మహంతేశ కవటగి మఠ, సంజయ్ పాటిల్ తదితరులతో కలిసి మఠంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు.


మఠాధిపతిని సత్కరిస్తున్న విజయేంద్ర, ఇతర నేతలు

రాజీనామా చేస్తారు..

ముడా అక్రమాల్లో చిక్కుకున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పదవికి రాజీనామా చేసే కాలం చేరువయ్యిందని విజయేంద్ర వ్యాఖ్యలు చేశారు. విజయదశమి అనంతరం ఏ క్షణంలో అయినా ముఖ్యమంత్రి మార్పు ఉంటుందన్నారు. బెళగావి, బెళగావి గ్రామీణం, చిక్కోడి విభాగాల కోర్ కమిటీ సభ్యులతో ఆయన గురువారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిని మార్చక మునుపే ఆ పీఠాన్ని దక్కించుకునేందుకు కొందరు మంత్రులు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారని ఎద్దేవా చేశారు. బూత్ స్థాయి నుంచి సభ్యత్వాన్ని పెంచుకునేందుకు తీసుకుంటున్న కార్యక్రమాలపై కోర్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించామన్నారు.

వసతి నిలయాన్ని సందర్శించిన ఏసీ

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు విభాగం సహాయ కమిషనర్ గజానన బాళె గురువారం నగరంలోని అంబేడ్కర్ డిగ్రీ విద్యార్థుల వసతి నిలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. రుచిగా వండాలని వంట సిబ్బందికి సూచించారు. పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని, ఇందుకు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవాలని విద్యార్థులకు చెప్పారు. సీసీ కెమెరాలను బాగు చేయించాలని వార్డెన్‌కు నిర్దేశించారు. ఆయన వెంట సాంఘిక సంక్షేమశాఖ అధికారులు చిదానంద, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.